రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త



# ఒబిసిల అభ్యున్నతి బాధ్యత నాది

## ఎమ్మెల్యే శంకర్ హామీ- టిపిసిసి ఒబిసి రాష్ట్ర చైర్మన్‌గా గాంధీభవన్‌లో ప్రమాణస్వీకారం

**షాద్‌నగర్, మార్చి 23, ప్రభాతవార్త :** ఒబిసి అభ్యున్నతి కోసం అంకితభావంతో కృషి చేస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. హైదరాబాదులోని గాంధీభవన్‌లో ఒబిసి సెల్ అధ్యక్షుడిగా మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం బాధ్యతలను అధికారికంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓబీసీ వర్గాల అభివృద్ధి కోసం తాను మరింత కృషి చేస్తానని, సామాజిక న్యాయం సాధనలో ముందుండి పని చేస్తానని స్పష్టం చేశారు. ఓబీసీ సమా జానికి అవకాశాలు పెంపొందించడమే తన ప్రధాన లక్ష్యం అని ఈ సందర్భంగా ఆయన అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ వీర్లపల్లి శంకర్ నాయకత్వంలో ఓబీసీ విభాగం మరింత బలోపేతం అవుతుందని అన్నారు. ఆయన సమర్థతకు తగిన బాధ్యతను అధిష్టానం అందజేసిందని పేర్కొన్నారు. అభినందనల వెలువ.. ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, తో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, అసెంబ్లీ విప్ ఆది శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే ప్రతాపరెడ్డి, మాజీ జెడ్పిటిసి శ్యాంసుందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బస్వం, సీనియర్ నాయకుడు కాశీనాథ్ రెడ్డి తదితరులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు అభినందనలు తెలిపారు. గాంధీ భవన్ కు షాద్ నగర్ నుంచి పెద్ద ఎత్తున నాయకులు బయలుదేరారు. ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం జయ జయ ద్వానాలతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. తెలంగాణ రాష్ట్ర ఓబీసీ విభాగం చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన షాద్‌నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్ ను ప్రజానాయకుడు జమ్రుత్ ఖాన్ అభినందించారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

---

### అత్యాచార కేసులో నిందితుడికి

# 10 ఏళ్ల జైలు

## వికారాబాద్ సెషన్స్ కోర్టు తీర్పు

## మహిళల భద్రత విషయంలో ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు

## జిల్లా ఎస్పి స్నేహ మెహ్రా



జిల్లా ఎస్పి స్నేహ మెహ్రా

**పరిగి, మార్చి 23, ప్రభాతవార్త :** చట్టం పరిధిలో ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, కేసుల విచారణలో పూర్తిస్థాయిలో పోలీసులు దృష్టి పెట్టాలని వికారాబాద్ జిల్లా ఎస్పి స్నేహ మెహ్రా స్పష్టంచేశారు. వికారాబాద్ జిల్లా పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలో 2016 సంవత్సరంలో నమోదైన కేసు విచారణలో భాగంగా నిందితుడికి పదేళ్ల కారాగార శిక్ష, 12వేల రూపాయల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చిందని ఎస్పీ స్నేహ మెహ్రా సోమవారం ప్రకటనలో తెలిపారు. పరిగి మండలం బర్కత్‌పల్లి గ్రామానికి చెందిన సుక్కాని అంజయ్య(37) అనే వ్యక్తిపై 2016లో అత్యాచారం , బెదిరింపులకు (సెక్షన్లు 376,506) సంబంధించి కేసు (సిఆర్ నం.268/2016)నమైదందని ఎస్పీ తెలిపారు. కేసు విచారణ వికారాబాద్ మొదటి అదనపు జిల్లా మరియు సెషన్స్ కోర్టులో కొనసాగిందన్నారు. పోలీసులు విచారణలో భాగంగా వారు సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి చౌదరి చంద్ర కిషోర్ నిందితుడు అంజయ్యను దిషిగా నిర్ధారించారు. నిందితుడికి 10సంవత్సరాల జైలు శిక్ష, 12వేల రూపాయలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెలువరిచిందని పేర్కొన్నారు. ఈ కేసు విచారణలో నిందితుడికి శిక్ష పడేలా సాక్ష్యాలను, అధారాలను అందించడానికి కృషి చేసిన అధికారులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. అప్పటి దర్యాప్తు అధికారులు వై.నాగేష్ నాటి పరిగి ఎస్ఐ ప్రసాద్, సిఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్‌హెచ్ఓ మోహన్ కృష్ణలను అభినందించారు. అలాగే కోర్టులో సమర్థవంతంగా వాదనలు వినిపించిన అడిషనల్ పి.పి మెరాజ్ ఫిర్దౌస్, సిడిఓ జగన్ మోహన్ రెడ్డి, కోర్టు లైజర్ ఆఫీసర్ ఎస్.నిరంజన్ గౌడ్‌ల పనితీరును ఎస్పీ ప్రశంసించారు. మహిళల భద్రత విషయంలో జిల్లా పోలీసు శాఖ అత్యంత కఠినంగా వ్యవహరిస్తుందని నేరస్థులు ఎంతటివారైనా చట్టం నుండి తప్పించుకోలేరని ఎస్పీ హెచ్చరించారు.

---

### చారిత్రక ఆలయానికి

# ఆర్థిక దన్ను

## పోట్లీ మహారాజ్ మందిర్ ఆస్తుల పరిరక్షణకు దేవాదాయశాఖ నిర్ణయం

- శిథిలావస్థకు చేరిన 28 దుకాణాలు
- లీజుదారుల భాగస్వామ్యంతో పునర్నిర్మాణం
- అద్దె రెండింతలు చేసి ఆలయానికి ఆదాయ వనరులు పెంచాలని యోచన
- అధికారుల చర్యలపై స్థానికంగా రాజకీయ రగడ
- అభివృద్ధికి అడ్డురావద్దని స్థానికుల విజ్ఞప్తి

(ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి)

తాండూరు నడిబొడ్డున శిథిలావస్థకు చేరుకున్న దేవాదాయ శాఖ నిర్మాణాలకు పునర్జీవం కల్పించటానికి రంగం సిద్ధమైంది. వివరాలలోకి వెళితే.. తాండూరులోని సద్గురు పోట్లీ మహారాజ్ దేవస్థానానికి విలువైన ఆస్తులు ఉన్నాయి. పోలీస్ స్టేషన్ కూడలి నుంచి రైల్వేస్టేషన్ మార్గంలో ఉన్న వీటిని వందల ఏళ్ల క్రితమే కేటాయించారు. చాలా ఏళ్ల క్రితం ఆలయ నిర్మాణం జరిగింది. దాని చుట్టూ పలు మడిగె (దుకాణాలు), ఆలయ ప్రాంగణంలో నివాస గృహాలు కూడా నిర్మించారు. 20 ఏళ్ల క్రితం ఓ స్కూలు నిర్మాణానికి కూడా అనుమతించారు. దుకాణ సముదాయం, స్కూలు ద్వారా వచ్చే ఆదాయం దేవాదాయ ధర్మాదాయశాఖకు చేరుతోంది. అయితే, దీర్ఘ కాలంపాటు షాపుల, స్కూలు భవనాల అద్దెలను పెంచలేదు. ఆయా షాపుల నిర్వాహకులకు వచ్చే రాబడి ఆధారంగా అద్దె వసూలు చేస్తున్నారు. ఇరుపక్షాల సమ్మతంతోనే ఈ విధానం అమలు అవుతోంది. దశాబ్దాల క్రితం నిర్మించిన షాపులు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. అప్పట్లో షాబాద్ బండలతో శ్లాబు నిర్మించారు. సుమారు అరవై ఏళ్ల క్రితం నిర్మించిన దుకాణాలు ప్రమాదకరంగా మారడంతో వాటి స్థానంలో కొత్త నిర్మాణాలు చేపట్టాలని ఆలయ పాలకవర్గం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు గత ఏడాది డిసెంబరులో దేవాదాయశాఖకు నివేదించారు. అందుకు సంబంధిత ఉన్నతాధికారులు స్పందిస్తూ.. ఇది వరకు లీజు పొందిన దుకాణాల యజమానులే కొత్త షాపుల నిర్మాణానికి అయ్యే ఖర్చును భరించి పునర్నిర్మాణం చేపట్టాలని సూచించారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాత వాటిని కూల్చివేసి మున్సిపల్ అనుమతులతో నిర్మాణం చేపట్టాలని ఆలయ కమిటీ చైర్మన్ ప్రసాద్‌గౌడ్, సభ్యులు, ఈవో నరేందర్ నిర్ణయించారు. మెయిన్ రోడ్డు నుంచి ఆలయ ప్రాంగణం వరకు 28 దుకాణాలు నిర్మించేందుకు నిర్ణయించారు. గతంలో ఒక్కో దుకాణానికి రూ.800 నుంచి 1200 లోపు అద్దె వసూలు చేశారు. విద్యాసంస్థ నుంచి మాత్రమే ఆశాజనకంగా అద్దె వస్తోంది. కొత్త నిర్మాణాల నేపథ్యంలో అన్నింటికీ అద్దె రెండింతలు పెంచి ఆలయానికి ఆదాయం పెరగాలని భావిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి రెండేళ్లకు అద్దెను పెంచేందుకు కూడా దృష్టి సారించారు. అలా ప్రతినెలా స్కూలు, షాపులపై కనీసం లక్ష రూపాయల వరకు రాబడి వచ్చేలా చేయాలని పాలకవర్గం దృష్టి సారించింది. ఈ క్రమంలో పాత వాటిని కూల్చి వేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు.

**దేవాదాయశాఖ రాబడికి అడ్డుపుల్ల**

ఈ నేపథ్యంలో తాండూరులో మరోవైపు గుడి రాజకీయాలు కూడా రాజుకుంటున్నాయి. ప్రాచీన ఆలయ నిర్మాణాలకు కొర్రీలు పెట్టే ప్రయత్నాలకు కొంతమంది తెరలేపారు. దుకాణాల సముదాయాలను టార్గెట్ చేస్తూ వాటిని అడ్డుకునేందుకు శత విధాలుగా ప్రయత్నిస్తున్నారు. రెండు, మూడు రోజులుగా ఆసక్తికరమైన పరిణామాలు చోటు చేసుకున్నాయి. దుకాణాల నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా అంటూ కొంతమంది ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. మరికొందరైతే పాత వాటిని కూల్చివేతకు అనుమతులు పొందారా అంటూ అధికారులను నిలదీస్తున్నారు. దుణాల సముదాయంపై పొట్టపోసుకునే తమ ఉపాధికి ఈ విధమైన రాజకీయ జోక్యం అవరోధంగా మారుతుందని చిరువ్యాపారుల నుంచి ఆందళన వ్యక్తమవుతోంది. అభివృద్ధి నిరోధకుల రాద్ధాంతానికి దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులకు సైతం తలనొప్పిగా మారుతోంది. శిథిలావస్థకు చేరుకున్న దుకాణాల స్థానంలో కొత్త నిర్మాణాలు చేపట్టాలని భావిస్తుంటే అడ్డుతగలడం భావ్యం కాదని స్థానికులు హెచ్చరిస్తున్నారు. మంచి పనులు చేయాలని సంకల్పిస్తున్న స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి, ఆయన సోదరుడు శ్రీనివాస్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని ఆలయ దుకాణాల నిర్మాణాలకు అడ్డు పుల్ల వేస్తున్నారని మండిపడుతున్నారు.

**ఇల్లీగల్ ప్రసక్తే ఉండదు : చైర్మన్, ఈవో**

దుకాణ సముదాయ నిర్మాణంలో ఇల్లీగల్ ప్రసక్తే ఉండదని పోట్లీ మహారాజ్ ఆలయ కమిటీ చైర్మన్ ప్రసాద్‌గౌడ్, దేవాదాయ ధర్మాదాయ ఎగ్జిక్యూటివ్ అధికారి నరేందర్ స్పష్టం చేశారు.

ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు ఈ ప్రక్రియ చేపడుతున్నామని చెప్పారు. శిథిలావస్థకు చేరుకున్న షాపుల వల్ల ప్రమాదం ఏర్పడవచ్చని తెలిపారు. వాటి స్థానంలో కొత్త నిర్మాణాలు చేపడితే కనీసం 50 ఏళ్ల వరకు వాటి ఆలోచన ఉండదని అన్నారు. పైగా రాబడి కూడా పెరుగుతుందని వివరించారు. ఈ నిర్మాణాలపై అనవసర రాద్ధాంతం చేయవద్దని ప్రసాద్‌గౌడ్ స్పష్టం చేశారు.



ఆలయ ప్రాంగణంలో పాత షాపులను తొలగిస్తున్న దృశ్యం



ఆలయ ముఖద్వారం

**అక్కడ సిండికేట్‌ల దందా ఇలా..**

తాండూరు పట్టణంలో పలు ప్రభుత్వ సంస్థలకు చెందిన ఆస్తుల్లో పెద్ద ఎత్తున అక్రమంగా దుకాణాలు నిర్మించారు. ఏళ్ల తరబడి దర్జాగా దందాలు చేపడుతున్నారు. వాటిపై ఎవ్వరూ అడ్డుకున్న పాపాన పోలేదు. కొంతమంది సిండికేట్‌గా మారి షాపులు పంచుకున్నారు. అనుమతుల్లేని దుకాణాలను తమ పేర్లపై నమోదు చేసుకుని అద్దెలు వసూలు చేసి జేబుల్లో వేసుకుంటున్నారు. ఈ అద్దెలు ఎవరి జేబుల్లోకి వెళుతున్నాయో విచారణ జరిపితే వెలుగు చూస్తాయి. ఆయా సంస్థలకు ఆదాయం కూడా పెరుగుతుందని స్థానికులు అంటున్నారు. మొన్నటి వరకు జిల్లాలో ప్రసిద్ధి గాంచిన పలు ఆలయాల దుకాణ నిర్మాణాలపై రాజకీయం చేసిన కొంతమంది వ్యక్తులు తాజాగా పోట్లీ మహారాజ్ ఆలయ దుకాణాలపై కన్నేశారని.. ఈ విధమైన అభివృద్ధి నిరోధక చర్యలు మానుకోవాలని కోరుతున్నారు.

---



ప్రమాదంలో ధ్వంసం అయిన కారు

# రెండు టిప్పర్ల మధ్య కారు నుజ్జునుజ్జు

## నలుగురు విద్యార్థులకు గాయాలు

## కొత్తూరు జాతీయ రహదారిపై ప్రమాదం

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మార్చి 23 ప్రభాతవార్త :** కొత్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి-44పై వైజంక్షన్ వద్ద సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కర్నూలు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు ముందున్న టిప్పర్‌ని బలంగా ఢీకొట్టింది. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న మరో టిప్పర్ కూడా కారును ఢీకొట్టడంతో, రెండు టిప్పర్ల మధ్య కారు నలిగిపోయింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న నలుగురు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. కొత్తూరు ఎస్‌హెచ్‌ఓ జి. నర్సయ్య సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం క్షతగాత్రుల ఆరోగ్యం స్థిరంగా ఉందని, ప్రాణాపాయం తప్పిందని వైద్యులు తెలిపారు. ప్రమాద ఘటనతో కొంతసేపు రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు వెంటనే క్లియర్ చేసి, ప్రమాదానికి గురైన వాహనాలను క్రేన్ సహాయంతో తొలగించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారులు తగినంత దూరం పాటిస్తూ జాగ్రత్తగా నడపాలని, అజాగ్రత్త బ్రేకులు వేయకూడదని పోలీసులు సూచించారు. ప్రమాదాల నివారణకు అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని, ప్రజలు దాన్ని తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు.

**బొలెరో బోల్తా పడి యువకుడు మృతి**

**మోమిన్‌పేట్, మార్చి 23, ప్రభాతవార్త:** మండల పరిధిలోని మొరంగపల్లి గ్రామ శివారులో ఎల్లమ్మ తల్లి దేవస్థానం మలుపు వద్ద అతివేగంగా వెళుతున్న బొలెరో ట్రాలీ అదుపుతప్పి బోల్తా పడింది. ఎస్ఐ భరత్ భూషణ్ కథనం ప్రకారం.. అజీం (30) మోమిన్‌పేట్ సంత నుంచి గొర్రెలను బొలెరోలో నారాయణ్‌పేట్‌కు తీసుకువెళ్తుండగా రోడ్డుకు కుడివైపున ఉన్న కాలువలో ట్రాలీ బోల్తా పడింది. అజీం ఈ ప్రమాదంలో అజీం అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనంలో ఉన్న గుండోళ్ల మల్లప్పకు తీవ్ర గాయాలయ్యాయి. అజీం బావ అయిన ఫక్రుద్దీన్ (52) డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భరత్‌భూషణ్ తెలిపారు.



బోల్తా పడిన బొలెరో ట్రాలీ

---



భక్తులకు దర్శనమిస్తున్న శ్రీనివాసుడు

# వైభవంగా రథోత్సవం

**కొడంగల్, మార్చి 23, ప్రభాతవార్త :** కొడంగల్ ప్రాంతవాసులు ఇలవేల్పుగా భావించే శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. గత ఏడు రోజులుగా భక్తుల కోలహలం మధ్య కొనసాగుతున్న బ్రహ్మోత్సవాల్లో కలియుగ శ్రీనివాసుడు రోజుకో వాహనంపై ఊరేగుతు భక్తులకు దర్శనభాగ్యం కల్పి స్తుండడం ప్రాధాన్యతను సంతరించుకుంది. సోమవారం స్వామి వారి రథోత్సవం సందర్భంగా ఉదయం వేళల్లో తిరుమల తిరుపతి దేవస్థానం అర్చకులు శ్రీబాలాజీ ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి రథాన్ని ముందుకు నడిపించారు.

---

# అనుమానం పెనుభూతమై..

# భార్యను కడతేర్చిన భర్త

## బైక్‌పై శవాన్ని తీసుకెళ్లి పొలాల్లో పడేసిన నిందితుడు

## హత్య వివరాలు వెల్లడించిన ఎసిపి నారాయణ

**షాద్‌నగర్, మార్చి 23, ప్రభాతవార్త :** అనుమానం పెనుభూతమైంది. ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. ఇతరులతో చనువుగా ఉంటోందని భార్యను హతమార్చిన కిరాతకుడి ఉదంతం షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హత్య చేసిన అనంతరం ఎవరికీ అనుమానం రాకుండా మృతదేహాన్ని బైక్‌పై తరలించి పొలాల్లో పడేసిన నిందితుడిని పోలీసులు గంటల వ్యవధిలోనే అరెస్టు చేశారు. ఎసిపి లక్ష్మీనారాయణ కథనం ప్రకారం. మహబూబ్‌నగర్ జిల్లా వీరన్నపేటకు చెందిన పానుగంటి నర్సింలు (31), అదే ప్రాంతానికి చెందిన వివాహిత అయిన శోభ అలియాస్ శోభారాణి (33)ని నాలుగేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి మూడేళ్ల కుమార్తె మమత ఉంది. శోభకు అంతకుముందే వివాహం అవ్వగా.. ఒక కుమారుడు ఉన్నాడు. కొంతకాలం తర్వాత నర్సింలు మద్యానికి బానిస కావడంతో వీరి మధ్య గొడవలు మొదలయ్యాయి. వేధింపులు భరించలేక శోభ రంగారెడ్డిగూడెంలోని తన తల్లి వద్ద నివసిస్తోంది. భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకున్న నర్సింలు, ఎలాగైనా ఆమెను అంతమొందించాలని పథకం వేశాడు.

**మాయమాటలతో పిలిపించి..**

కుమారుడికి సైకిల్ ఇప్పిస్తానని నమ్మబలికి శోభను ఈనెల 21న మహబూబ్‌నగర్‌కు రప్పించాడు. తన గదికి తీసుకెళ్లి మద్యం సేవించాడు. అక్కడ మళ్లీ గొడవ జరగింది. ముందే సిద్ధం చేసుకున్న గ్రానైట్ రాయితో ఆమె తలపై బలంగా కొట్టి హత్య చేశాడు. అనంతరం ఎవరికీ అనుమానం రాకుండా రక్తపు మరకలను శుభ్రం చేశాడు. అర్ధరాత్రి సమయంలో మృతదేహాన్ని మూటకట్టి, బైక్ పెట్రోల్ ట్యాంక్‌పై పెట్టుకున్నాడు. దానిపైనే తన మూడేళ్ల కుమార్తెను కూర్చోబెట్టుకుని, రంగారెడ్డిగూడెం శివారులోని ఓ పొలం గట్టున పడేసి పరారయ్యాడు. మరుసటి రోజు స్థానికుల సమాచారంతో పోలీసులు రంగంలోకి దిగి కేసు దర్యాప్తు ప్రారంభించారు. సోమవారం ఉదయం లింగంపల్లిలో నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి ఒక సెల్ ఫోన్, హత్యకు వాడిన రాయి, రక్తపు మరకలున్న దుస్తులను స్వాధీనం చేసుకున్నట్లు ఎసిపి మీడియాకు వివరించారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఇన్‌స్పెక్టర్ కె. సీతారాం, ఎస్ఐలు సుశీల, శ్రీకాంత్, రాజేశ్వర్, శివరెడ్డిలను ఫ్యూచర్ సిటీ కమిషనర్, షాద్‌నగర్ డీసీపీ అభినందించారు.

---



తనిఖీ చేస్తున్న కలెక్టర్ మనుచౌదరి

# టెన్త్ పరీక్షా కేంద్రం తనిఖీ

**శామీర్‌పేట, (మేడ్చల్ జిల్లా ప్రతినిధి), మార్చి 23, ప్రభాతవార్త :** హకీంపేట్‌లోని తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని మేడ్చల్ కలెక్టర్ మనుచౌదరి సోమవారం తనిఖీ చేశారు. పరీక్షలు సజావుగా నిర్వహించేలా చూడాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు అవసరమైన మంచినీరు, లైట్లు, ఫ్యాన్లు, మెడికల్ సౌకర్యాపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, శామీర్‌పేట మండల తహసీల్దార్ సుచరిత, తదితరులు పాల్గొన్నారు.

---

# ప్రజావాణి సాగిందిలా...



అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

## ఆలయ భూములను పరిరక్షించాలని ఫిర్యాదు

**శామీర్‌పేట, మార్చి 23, ప్రభాతవార్త :** శామీర్‌పేట మండలం మజీద్‌పూర్‌లోని శివాలయ ప్రభుత్వ భూమిని కబ్జా నుంచి కాపాడాలని గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. అలియాబాద్ మున్సిపల్ వార్డు కౌన్సిలర్ సామల జశ్వంత్‌రెడ్డి, మేడ్చల్ ఎఎంసి డైరక్టర్ తుంకి బిక్షపతి, నాయకులు నర్సింగ్‌రావుగౌడ్ తదితరులు కలెక్టరేట్‌కు వెళ్లి అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డిని ప్రజావాణిలో కలిసి వినతిపత్రం సమర్పించారు. సర్వేనెంబరు 168లో శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయానికి సంబంధించిన ఎకరం 17 గుంటల భూమి ఉన్నట్లు వివరించారు. కొందరు ఆక్రమించారని ఆరోపించారు. కబ్జాల నుంచి విముక్తి చేసిహద్దులు నిర్ణయించాలని విజ్ఞప్తిచేశారు.

## వాణిజ్య సముదాయాలకు వేలం వద్దే వద్దు

### డబుల్ బెడ్‌రూమ్ కాలనీ నిర్వహణకు ఈ ఆదాయాన్ని వినియోగించాలి

### సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డిమాండ్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 23, ప్రభాతవార్త :** జిల్లాలో గల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద గల వాణిజ్య సముదాయాలను ప్రభుత్వం వేలం ద్వారా విక్రయించాలని నిర్ణయించటం సరికాదని వెంటనే విక్రయాలను ఆపాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య డిమాండ్ చేశారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద సిపిఎం నాయకులు, అహ్మద్‌గూడ డబుల్‌బెడ్‌రూమ్ నివాస నాయకులు విజయ్ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు వీరయ్య మాట్లాడుతూ మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో 16 డబుల్ బెడ్ రూమ్ కాలనీలు ఉండి 992 వాణిజ్య సముదాయాలను వేలం పాట ద్వారా విక్రయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. అందుకు ఏర్పాట్లు చేయాలని ప్రకటించటం ప్రజా ప్రయోజనాలకు భిన్నమైన చర్య అని అన్నారు. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కాలనీల వద్ద నిర్వాహణ కోసం ప్రజలపై భారం పడకుండ ఉండటానికి వాణిజ్య సముదాయాలను నిర్మించిందని గుర్తుచేశారు. వాణిజ్య సముదాయాల ద్వార వచ్చే ఆదాయాన్ని లిఫ్టులు, ఇతర మెయింటనెన్స్‌కు




కలెక్టరేట్ వద్ద డబుల్ బెడ్‌రూమ్ కాలనీ వాసులతో కలిసి ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

## అర్జీల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

### కలెక్టర్ మనుచౌదరి ఆదేశం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 23, ప్రభాతవార్త :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ఎలాంటి జాప్యం లేకుండా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం జరిగింది. దీనిలో జిల్లా వ్యాప్తంగా కలెక్టరేట్ ప్రజావాణికి విచ్చేసిన ప్రజల నుంచి కలెక్టర్, అదనపు కలెక్టర్, డిఆర్ఓలు దరఖాస్తులను స్వీకరించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా 163 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. వీటిలో హౌజింగ్ డిపార్ట్మెంట్‌కు అత్యధికంగా 58 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ ప్రజలు ఎంతో నమ్మకంతో వివిధ సమస్యల పరిష్కారం కోసం అర్జీలతో వస్తారని వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత అధికారుల అందరిపై ఉందని అన్నారు. తిరస్కరించే దరఖాస్తులకు వాటికి గల కారణాలను తప్పనిసరిగా అర్జీదారులు తెలియజేయాలని సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డిఆర్ఓ చంద్రావతి, జిల్లా సంబంధిత వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ మనుచౌదరి, పాల్గొన్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డిఆర్ఓ చంద్రావతి

# కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



వికారాబాద్ అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న బిఆర్ఎస్ నేతలు

**ధారూర్, మార్చి 23, ప్రభాతవార్త:** ధారూర్ మండలంలో సాగైన మొక్కజొన్న, జొన్న పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు తక్షణమే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు జిల్లా అదనపు (రెవెన్యూ) కలెక్టర్ రాజేశ్వరికి కోరారు. ఈ మేరకు సోమవారం మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పట్లోళ్ల శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ధారూర్ మండలంలో సుమారు 2500 ఎకరాల్లో మొక్కజొన్న, మరో 2500 ఎకరాల్లో జొన్న పంటలు సాగయ్యాయని తెలిపారు. ప్రభుత్వం జొన్నలకు క్వింటాలుకు 3,690, మొక్కజొన్నకు 2,400 మద్దతు ధర ప్రకటించినప్పటికీ, ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో జొన్నలు కేవలం 2,000, మొక్కజొన్న 1,600 ధరలు మాత్రమే పలుకుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ధరల వ్యత్యాసం వల్ల రైతులు భారీగా నష్టపోతున్నారని, పెట్టిన పెట్టుబడి కూడా రాక రైతాంగం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతోందని వివరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మండల వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, రైతులు పండించిన పూర్తి పంటను ప్రభుత్వ మద్దతు ధరకే కొనుగోలు చేసి వారిని ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు వేణుగోపాల్ రెడ్డి, ఎ. అంజయ్య, ఎం.ఏ హాఫీజ్, అజయ్ పాల్ రెడ్డి, పి. వెంకటయ్య, జి. రాములు, బి. దేవేందర్ నాయక్, జి. వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## నిధులు ఇవ్వకపోతే ఎమ్మెల్యేను అడ్డుకుంటాం

### బిఆర్ఎస్ సర్పంచుల ఆందోళన

**పరిగి, మార్చి 23, ప్రభాతవార్త :** బిఆర్ఎస్ సర్పంచ్‌లు ఉన్న పంచాయతీలకు నిధులు ఇవ్వడంలో వివక్ష చూపిస్తున్నారని పరిగి మండల బిఆర్ఎస్ సర్పంచులు ఆరోపించారు. సోమవారం పరిగి పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటుచేసిన మీడియా సమవేశంలో వారు మాట్లాడారు. బిఆర్ఎస్ పార్టీకి చెందిన సర్పంచులపై స్థానిక ఎమ్మెల్యే వివక్షత చూపిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ సర్పంచ్‌లు ఉన్న పంచాయతీలకే నిధులు ఇస్తున్నారని తెలిపారు. కేంద్రం నుంచి వచ్చే ఉపాధి హామీ నిధులను కూడా ఇవ్వకుండా గ్రామాల అభివృద్ధికి సహకరించడంలేదని తెలిపారు. ప్రజల తీర్పుతో గెలిచిన తాము.. గ్రామ అభివృద్ధికి సహకరించకుంటే ఎమ్మెల్యేను అడ్డుకుంటామని హెచ్చరించారు. ప్రజలతో కలిసి ధర్నా చేపడతామని బిఆర్ఎస్ సర్పంచులు పేర్కొన్నారు. రంగాపూర్, తొండపల్లి, మిట్టకోడూర్, మాదారం, కుదావన్ పూర్, రాపోల్, చిట్యాల, బసిరెడ్డిపల్లి, రూప్ ఖాన్ పేట్, బర్కత్ పల్లి, రాఘవాపూర్ సర్పంచులు మందాకిని, కృష్ణయ్య, మాణిక్యం, రాములు, యాదయ్య, క్రిష్ణ, రాజు, శ్రీశైలం, అంజమ్మ, భ్రమరాంబ, స్రవంతి సమావేశంలో పాల్గొన్నారు.





వైకుంఠ రథాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య

## వైకుంఠ రథం బహూకరణ

**షాద్‌నగర్ రూరల్, మార్చి 23, ప్రభాత వార్త :** ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామ పంచాయతీ అభివృద్ధి పట్ల నిబద్ధతను చాటూతూ, తన తల్లిదం డ్రులు బుగ్గ పోచయ్య, గోపమ్మల జ్ఞాప కార్థం గ్రామసర్పంచ్ బుగ్గ కృష్ణయ్య వైకుం ట రథాన్ని గ్రామానికి అందజేశారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ రథాన్ని ప్రారంభించి, కృష్ణయ్యసేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, మాజీ జడ్పీ వైస్ ఛైర్మన్ ఈట గణేష్, మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, సర్పంచులు గీత వీరేషం, కృష్ణవేణి, నరేందర్, గ్రామ ప్రజలు, మాజీ ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## ఆక్రమణలతో ఇక్కట్లు

**కోట్‌పల్లి, మార్చి 23, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ పరిసరాలు చిరువ్యాపారుల చేతిలో ఆక్రమణకు గురవుతున్నాయి. తోపుడు బండ్లు ఎక్కడ పడితే అక్కడే పెట్టి పండ్లు అమ్ముతున్నారు. రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, అదేమని ప్రశ్నిస్తే దౌర్జన్యానికి దిగుతున్నారని ప్రయాణీకులు వాపోతున్నారు. రోడ్డు విస్తరణ జరగకపోవడంతో ఆ మార్గం అంతా ఇరుకుగా మారింది. మండల కేంద్రంలో ప్రతి సోమవారం సంత నిర్వహిస్తారు. అలాంటి సందర్భాలలో మరింత అసౌకర్యం ఏర్పడుతోంది. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## వాణిజ్య సముదాయాలకు వేలం వద్దే వద్దు

(మొదటి పేజీ తరువాయి)

వాడవచ్చని తద్వారా ప్రజలపై భారం లేకుండ ఉంటుందని నిర్మించారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని వేలం ద్వారా విక్రయిస్తే మెయింటనెన్స్ ఖర్చులు ప్రజలపై భారం పడుతుందన్నారు. వెంటనే వేలం ద్వారా విక్రయాలను నిలిపివేయాలని వీరయ్య డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజలతో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కాలనీల వద్ద అంగన్‌వాడి కేంద్రాలు, వైద్య, విద్యా కేంద్రాలు ఏర్పాటు చేయాలని, డ్రైనేజీ, లిఫ్టులు, నీటి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్ మనుచౌదరిని ప్రజావాణిలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకవెళతామని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సిపిఎం కార్యదర్శి పి.సత్యం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోమటి రవి, వినోద, అశోక్, సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు రాథోడ్ సంతోష్, లింగస్వామి, నరేశ్, సబిత, వెంకన్న, సిపిఎం పార్టీ నాయకులు గణేశ్, నర్సింగ్‌రావు, బాలపీర్, విజయ్, శ్రీనివాస్, అంజనేయులు, సురేశ్, డబుల్‌బెడ్‌రూమ్స్ నివాసులు, సిపిఎం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ సి.నారాయణరెడ్డి

# అర్జీలకు తక్షణ పరిష్కారం

### అధికారులకు కలెక్టర్ ఆదేశం

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మార్చి 23, ప్రభాతవార్త :** జిల్లాలో ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే అర్జీలను అత్యంత ప్రాధాన్యంతో తీసుకుని వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 53 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారీగా అందిన ఫిర్యాదులపై అధికారులు వెంటనే స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిరంతరం పరిశీలిస్తూ తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ రోజు వచ్చిన 53 ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శాఖల వారీగా వచ్చిన ఫిర్యాదుల్లో రెవెన్యూ శాఖకు 10, ఇతర శాఖలకు 43గా మొత్తం 53 దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ మండల తహశీల్దారులు పాల్గొన్నారు.

## భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాటాలు చేయాలి



మాట్లాడుతున్న వక్తలు

**షాద్‌నగర్ రూరల్, మార్చి 23, ప్రభాతవార్త :** భారత స్వాతంత్ర్య సమరయోధులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 95వ వర్ధంతిని పురస్కరించుకొని షాద్‌నగర్ పట్టణ కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ముందు భగత్‌సింగ్ విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఓయూ ప్రొఫెసర్ అమంచి నాగేశ్వర్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ... భగత్‌సింగ్ కేవలం స్వాతంత్ర్యం కోసమే కాకుండా, దోపిడి లేని సమాజం కోసం పోరాడారని కొనియాడారు. నేటి ప్రభుత్వాలు విద్య, వైద్యం, ఉపాధి రంగాలను నిర్లక్ష్యం చేస్తున్నాయని, యువత భగత్‌సింగ్ స్ఫూర్తితో హక్కుల సాధన కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. విదేశీ శక్తులకు దేశ సంపదను తాకట్టు పెట్టే ధోరణిని వ్యతిరేకించాలని సూచించారు. జేవీవీ కురుమయ్య అధ్యక్షతన జరిగిన ఈ సభలో టీఎస్‌యూటీఎఫ్ నేత వెంకటప్ప, ఎంఈఓ మనోహర్, వివిధ ప్రజా సంఘాల నాయకులు, విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొని అమరవీరులకు నివాళులర్పించారు.

## ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ విఫలం



మాట్లాడుతున్న బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి

**ధారూర్, మార్చి 23, ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 28 నెలలు గడుస్తున్నా, ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ధారూర్ బీఆర్ఎస్ మండల అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ నాయకులు వేణుగోపాల్ రెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలోని స్టార్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 100 రోజుల్లోనే హామీలన్నీ నెరవేరుస్తామని నమ్మబలికిన రేవంత్ రెడ్డి సర్కార్ ఇప్పటికీ ప్రజలను మోసం చేస్తూనే ఉందని మండిపడ్డారు. గతంలో కేసీఆర్ ఎలాంటి ముందస్తు వాగ్దానాలు చేయకుండానే రైతు బంధు, రైతు బీమా వంటి పథకాలను విజయవంతంగా అమలు చేసి అన్నదాతలను ఆదుకున్నారని గుర్తు చేశారు. అప్పట్లో ప్రతిపక్షంలో ఉండి రైతు బంధు మూడు సార్లు ఇవ్వాలని డిమాండ్ చేసిన రేవంత్ రెడ్డి, అధికారంలోకి వచ్చాక కేవలం ఒక్కసారి మాత్రమే ఇచ్చి రైతులను వంచించారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో ధారూర్ మండల మాజీ సర్పంచ్ చంద్రమోళి, అంజయ్య, చానా పాషా, ఉప సర్పంచ్ జహంగీర్, గట్టేపల్లి మాజీ భీంషేన్ చారి, గట్టేపల్లి సర్పంచ్ లక్ష్మీ ్మ వెంకటయ్య, రాంపూర్ సర్పంచ్ రవి నాయక్, ఉప్ప సర్పంచ్ నరేష్ నాయక్, ధారూర్ టౌన్ ప్రెసిడెంట్ ఫోటరీ మహేష్, యూత్ ప్రెసిడెంట్ మహేష్, పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## ఎన్ని నిర్బంధాలు విధించినా ప్రజల కోసం పోరాడతాం



బిజెపి నేతలను అరెస్టు చేసిన పోలీసులు

**కేశంపేట, మార్చి 23 ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేయడంలో విఫలమైందని బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి ముల్తంకర్ శివాజీ అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు పిలుపుమేరకు చలో అసెంబ్లీ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రశ్నించేందుకు వెళ్తున్న బిజెపి నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడం సమంజం కాదన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు కూడా లేకపోవడం దారుణమన్నారు. ఎన్ని నిర్బంధాలు విధించినా ప్రజల కోసం బిజెపి పోరాడుతూనే ఉంటుందని శివాజీ అన్నారు. కేశంపేట మండల పరిధిలోని బిజెపి నాయకులైన కర్రెడ్ల నరేందర్ రెడ్డి, కంచుకోట నరసింహ భక్తవత్సలా రమేష్ రావుల రాకేష్‌లను అరెస్టు చేసి కేశంపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## సామాజిక న్యాయ సాధనకు కృషి చేయాలి



ఎమ్మెల్యే శంకర్‌ను అభినందిస్తున్న ఎం.డి.ఇబ్రహీం

**షాద్‌నగర్ రూరల్, మార్చి 23, ప్రభాత వార్త :** రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ విభాగం ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను మైనార్టీ నేత ఇబ్రహీం అభినం దించారు. సోమవారం రాష్ట్ర మంత్రి పొ న్నం ప్రభాకర్ సమక్షంలో ఎమ్మెల్యే ప్రమాణం చేసిన నేపథ్యంలో ఆయనను ఎండి.ఇబ్రహీం కలుసుకొని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లా డుతూ... సామాజిక న్యాయ సాధనలో శంకర్ అన్న ఎప్పుడూ ముందుం టారన్నారు. ఆయన నాయకత్వంలో ఓబీసీ విభాగం మరింత బలోపేతం అవుతుందని ఆకాంక్షించారు.

### ఒబిసి వర్గాల అభివృద్ధికి దోహదం



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న కేశంపేట మాజీ జడ్‌పిసి విశాల

**కేశంపేట మార్చి 23 ప్రభాతవార్త :** మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి కూడా ఎమ్మెల్యేను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఓబీసీ వర్గాల అభివృద్ధికి శంకర్ నాయకత్వం ఎంతో దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించడంలో ఆయనకు ఉన్న అనుభవం, కృషి ఈ కొత్త బాధ్యతలో మరింత ప్రతిఫలిస్తుందని తెలిపారు.

### అజాతశత్రువు వీర్లపల్లి



ఎమ్మెల్యేను సన్మానించిన ఉమ్మడి మండలాల మాజీ ఎంపిపి శివశంకర్ గౌడ్ తదితరులు

**నందిగామ, మార్చి 23, ప్రభాతవార్త :** షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ టిపిసిసి ఓబీసీ విభాగం ఛైర్మన్‌గా నియమితులు కావడం పట్ల నందిగామ మండల వ్యాప్తంగా ఆనందోత్సవాలు వెల్లివిరుస్తున్నాయి. ఆయనతోపాటు టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌లను హైదరాబాద్ గాంధీ భవన్‌లో మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్ తదితరులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శివ శంకర్ గౌడ్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి పని చేస్తున్న ఎమ్మెల్యే శంకర్ ప్రభుత్వ రంగ సంస్థల ఛైర్మన్‌గా సేవలందిస్తూనే టిపిసిసి ఓబిసి విభాగం ఛైర్మన్ గా బాధ్యతలు స్వీకరించడం గర్వకారణం అన్నారు. రాజకీయాల్లో అజాతశత్రువుగా ఆయన నాయకత్వం, సేవా తపన, ప్రజల పట్ల ఉన్న నిబద్ధతతో భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆయన ఆకాంక్షి ంచారు.

## సాహిత్యం, సంగీతమే సమాజానికి ప్రాణవాయువు

**చిక్కడపల్లి, మార్చి 23, ప్రభాతవార్త :** సాహిత్యం, సంగీతం సమాజానికి ప్రాణవాయువు వంటివి అని జాతీయ సాహిత్య పరిషత్ పూర్వ అధ్యక్షులు డాక్టర్ కసిరెడ్డి వెంకట రెడ్డి అన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సాహిత్య సంగీత సభ టీచర్ అంచల సుబ్బన్న మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు అంచల పంపావతి, డాక్టర్ అంచల పార్థసారథి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా "ప్రణామం" పేరుతో యూట్యూబ్ ఛానెల్, చిన్నారుల కోసం వర్డ్స్ ఆఫ్ విజ్డమ్ ఈ బుక్ ఫర్ కిడ్స్ రిథమ్, తెలుగు, ఆంగ్ల అనువాదంతో కూడిన శంకరాచార్య విరచిత భజగోవిందం గ్రంథాల ఆవిష్కరించి ప్రసంగించారు. మారుతున్న కాలంలో యువత మన సంస్కృతిని, సంప్రదాయాలను ప్రతిబింబించే పుస్తకాలను చదవాల్సిన అవసరం ఉందన్నారు ప్రణామం వంటి గ్రంథాలు, భజగోవిందం వంటి ఆధ్యాత్మిక అనువాదాలు నేటి తరం ఆలోచనా దృక్పథాన్ని మారుస్తాయి" అని పేర్కొన్నారు. సాహిత్యం కేవలం వినోదం కోసం కాదు, అది వ్యక్తిత్వ వికాసానికి పునాది అని అన్నారు. బాల్యంలోనే నైతిక విలువలను నేర్పించడం ద్వారా బాధ్యతాయుతమైన పౌరులను తయారు చేయవచ్చు" అని అన్నారు. భగవద్గీత ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎల్. గంగాధర శాస్త్రి సంగీతం మనసును ప్రశాంతంగా ఉంచుతుందని, ఆధ్యాత్మిక సాహిత్యంతో కూడిన సంగీతం మనిషిని ఉన్నత శిఖరాలకు చేరుస్తుందని తెలిపారు.

## డయాలసిస్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలి



చేవెళ్ల ప్రభుత్వ అసుపత్రిలోని డయాలసిస్ సెంటర్‌ను సదర్శించిన ఎమ్మెల్యే యాదయ్య

**చేవెళ్ల, మార్చి 23, ప్రభాతవార్త :** చేవెళ్ల ప్రభుత్వ అసుపత్రిలో నిలిచిపోయిన డయాలసిస్ సేవలను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య సూచించారు. సోమవారం చేవెళ్ల ప్రభుత్వ అసుపత్రిలోని డయాలసీస్ సెంటర్, పాలియోటివ్ కెర్ విభాగాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డయాలసీస్ సేవలు అత్యవసరమని, త్వరగా పునరుద్ధరించాలని కోరారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అసుపత్రిలో నిత్యం వైద్యులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ అనురాగిణి, చేవెళ్ల మున్సిపల్ ఛైర్మన్ దేవర సమత వెంకట్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ రాముగౌడ్, కౌన్సిలర్ బండారి శైలజ ఆగిరెడ్డి, శ్రీనివాస్, క్రిష్ణా నాయర్, సహకార సంఘం మాజీ ఛైర్మన్‌లు గోనే ప్రతాప్‌రెడ్డి, దేవర వెంకట్‌రెడ్డి, పల్గుట్ట రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అనుమతులు లేకుండా కలప తరలిస్తున్న డిసిఎం సీజ్



అటవీ శాఖ అధికారుల అదుపులో కలప డిసిఎం

**ధారూర్, మార్చి 23, ప్రభాతవార్త:** ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా కలపను తరలిస్తున్న ఒక డీసీఎం వాహనాన్ని అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. సెక్షన్ ఆఫీసర్ కనకరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ధారూర్ అటవీ రేంజ్ పరిధిలోని యాలాల మండలం ముద్దాయిపేట వద్ద అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా అటుగా వస్తున్న డీసీఎం వాహనాన్ని ఆపి సోదా చేయగా, లోపల పెద్ద ఎత్తున కలప నిల్వలు కనబడ్డాయి. వీటికి సంబంధించిన రవాణా అనుమతి పత్రాలను చూపాలని అధికారులు కోరగా, డ్రైవర్ వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో వాహనాన్ని స్వాధీనం చేసుకుని ధారూర్ రేంజ్ కార్యాలయానికి తరలించారు. ఈ ఘటనపై అటవీ శాఖ చట్టం ప్రకారం యజమాని రామావత్ రాజు పై కేసు నమోదు చేసినట్లు అధికారి కనకరాజు స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కాశయ్య, ప్రొటెక్షన్ వాచర్లు ఆఫ్రిది, శ్రీధర్, నార్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## చేవెళ్లలో అర్హులందరికీ ఇళ్లు ఇస్తాం



ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**చేవెళ్ల, మార్చి 23, ప్రభాతవార్త:** చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. సోమవారం చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని 7వ వార్డు మల్లారెడ్డగూడలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిరుపేద ప్రజలకు ఇంటిని నిర్మించి ఇవ్వడం ప్రభుత్వ భాద్యతన్నారు. ప్రతి కుటుంబానికి ఇల్లు ఉండాలన్న ఉద్దేశంతో, నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి నిర్మించి ఇస్తున్నట్లు తెలిపారు. సిఎం రెవంత్‌రెడ్డి ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పాటుపడుతోందన్నారు. చేవెళ్ల నియోజకవర్గంలో ఇల్లులేని నిరుపేదలు ఉండకుండదని, ప్రతి ఒక్కరికి అంచలంచెలుగా ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మార్కెట్ కమిటి ఛైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ ఛైర్మన్ రాములు, చేవెళ్ల మున్సిపల్ ఛైర్మన్ దేవర సమత వెంకట్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ రాముగౌడ్, కౌన్సిలర్ బండారి శైలజ ఆగిరెడ్డి, శ్రీనివాస్, క్రిష్ణా నాయర్, మల్లేష్, సహకార సంఘం మాజీ ఛైర్మన్‌లు గోనే ప్రతాప్‌రెడ్డి, దేవర వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచులు మోహన్‌రెడ్డి, ప్రభాకర్, మాజీ ఎంపిటిసి రవీందర్, పల్గుట్ట రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న సర్పంచ్

**నందిగామ, మార్చి 23, ప్రభాతవార్త:** నందిగామ గ్రామంలో సోమవారం ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు జి.అమృత వెంకటయ్యకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు సర్పంచ్ కొమ్ము కృష్ణ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొమ్ము కృష్ణ మాట్లాడుతూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో ఇల్లు లేని ప్రతి నిరుపేదకు ఇండ్లు నిర్మించి ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జంగ నరసింహులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు జిల్లెల్ల బాల్ రెడ్డి, షాద్నగర్ ఏఎంసీ డైరెక్టర్ నర్సింలు, వార్డు సభ్యులు అగ్గిప్రసాద్, శివగళ్ళ సురేష్, టైలర్ కృష్ణ , బొమ్మ గళ్ళ నరసింహులు, మాజీ ఎంపీటీసీలు కుమార్ గౌడ్, చంద్రపాల్ రెడ్డి, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు పిట్టల రాములు, కాంగ్రెస్ నాయకులు దారలింగం ,ప్రభయ్య, కేశమోని అంజయ్య యాదవ్, బి.జంగయ్య గౌడ్, తడకల జంగయ్య, సపిడి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# భూభారతితో నిరుపేదలకు అన్యాయం

### - సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ధ్వజం



రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి ప్రజాసమస్యపై వినతిపత్రాన్ని సమర్పిస్తున్న సిపిఎం శ్రేణులు

**ఇబ్రహీంపట్నం, మార్చి 23, ప్రభాతవార్త :** గత ప్రభుత్వం ధరణి పేరుతో పేదల కడుపు కొట్టిందని. ప్రభుత్వం మారితే పేదలు తమ బతుకులు మారుతాయని కాంగ్రెస్‌కు పట్టం కట్టబెడితే ఈ ప్రభుత్వం కూడ పేరు మాత్రమే మార్చి భూ భారతితో పేదల నోట్లో మట్టి కొడుతున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఆరోపించారు. సోమవారం ఇబ్రహీంపట్నం నుండి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు భూ సమస్యల పరిష్కారం కోరుతూ ఆయన పాదయాత్రను ప్రారంభించి పార్టీ శ్రేణులు, వందలాది మంది బాధితులతో కలిసి మంగళపల్లి గేట్ వరకు నడిచారు.

అనంతరం అక్కడి నుండి పార్టీ శ్రేణులు భారీ ప్రదర్శనగా వెళ్లి కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ జిల్లాలో రెవెన్యూ యంత్రాంగం వైఫల్యం వల్ల వేలాది మంది పేదలు ఇళ్ల స్థలాలు, సాగు భూములకు దూరమవుతున్నారని. అబ్దుల్లాపూర్ మెట్, కందుకూరు, మహేశ్వరం ప్రాంతాల్లో పట్టాలు ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా ప్లాట్ల పొజిషన్ చూపకపోవడం అన్యాయమని ఆయన మండిపడ్డారు. 1991లో సీలింగ్ పట్టాలు పొందిన అనాజ్‌పూర్ రైతులకు నేటికీ కొత్త పాస్ పుస్తకాలు ఇవ్వలేదని, ఫ్యూచర్ సిటీ పేరుతో యాచారం మండలం సింగారం రైతుల భూములను బలవంతంగా లాక్కోవద్దని, రక్షిత కౌలు రైతులకు పట్టాలు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ఏడాదికి 200 రోజులలు రూ.800లు పెంచాలని అదేవిదంగా జిల్లాలోని ఆరుట్ల, రంగాపూర్ తదితర మారుమూల గ్రామాలకు అనుసంధానంగా ఉన్న రహదారులను బి.టి. డబుల్ రోడ్లుగా యుద్ధప్రతిపాదికన అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ముందుగా చిత్రపటానికి పూలమాలలు వేసి సివాళులర్పించారు. భగత్‌సింగ్ ఆశయాల స్ఫూర్తితో ఎర్రజెండా పోరాటం ఆగదని స్పష్టం జాన్‌వెస్లీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి. సామేల్, దుబ్బాక రాంచందర్, నర్సిం హ్మా, జగన్, జగదీష్ తదితరులున్నారు.



వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న సిపిఐ, ఏఐవైఎఫ్ నాయకులు

## భగత్‌సింగ్ సేవలు ఆదర్శనీయం

**ఘట్‌కేసర్ రూరల్, మార్చి 23, ప్రభాత వార్త:** పోచారం డివిజన్ పరిధిలోని అన్నోజిగూడ రాజీవ్ గృహకల్ప కాలనీలో సీపీఐ, ఏఐవైఎఫ్ నేతలు సోమవారం భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య పోరాటంలో భగత్‌సింగ్ నిర్వహించిన పాత్ర యావత్తు దేశం విస్మరించరానిదని అన్నారు. 12 ఏళ్ల అతిచిన్న వయస్సులోనే స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని 23 ఏళ్ల యుక్త వయస్సులో దేశం కోసం ప్రాణాలర్పించి ఎందరో యువతకు స్ఫూర్తిగా నిలిచారని కొనియాడరు. ఈ కార్యక్రమంలో సిపిఐ, జిల్లా నాయకులు కల్లూరి జయచంద్ర, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి సంపంగి సదాశివ, నాయకులు మురళి, ఏ. మల్లేశ్, శ్రీనివాస్, వి. వెంకటరమణ, శ్రీనివాస్ సిహెచ్. చంద్రాజీ, శ్యామ్, పాండు తదితరులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న ఎంపిడివో

## మెరిట్ విద్యార్థికి సత్కారం

**యాచారం, మార్చి23, ప్రభాతవార్త :** యాచారం మండల పరిధిలోని తక్కలపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సంతోష రమేష్‌ల ద్వితీయ కుమారుడు సాత్విక్ పీఎం శ్రీ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్ష ఫలితాలలో ఉత్తమ మార్కుల సాధించి ఎంపికైనందుకు యాచారం ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలలోని విద్యార్థులు మట్టిలో మాణిక్యాలనీ నవోదయ, సైనిక్ పాఠశాలల లాంటి విద్యాలయాలకు ఎంపిక కావడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో తక్కలపల్లి సర్పంచ్ నరేందర్ రెడ్డి, సూపరిండెంట్ శైలజ, ఎంపీ ఓ శ్రీలత, సీనియర్ అసిస్టెంట్ మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.



నందిగామ బిజెపి నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

## ఆరు గ్యారెంటీలు అడిగితే అరెస్టులా..?

**నందిగామ, మార్చి 23, ప్రభాతవార్త:** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలన్న డిమాండ్‌తో అసెంబ్లీ ముట్టడికి వెళుతున్న బిజెపి నందిగామ మండల అధ్యక్షులు వడ్ల అరవింద్ చారిని సోమవారం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతకాని హామీ ఇచ్చి చేతులు దులుపుకున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో ప్రజలు తగిన గుణ పాఠం చెబుతారని హెచ్చరించారు. బిజెపి శ్రేణులను ముందస్తు అరెస్టు చేయడం పిరికిపంద చర్య అని ఆరోపించారు. అరెస్టు అయిన వారిలో మండల కార్యదర్శి మల్లేష్, నాయకులు ప్రవీణ్ గౌడ్ తదితరులు ఉన్నారు.

### కబ్జా చెర నుంచి విడిపించాలి

**నందిగామ, మార్చి 23, ప్రభాతవార్త:** నందిగామ మండల కేంద్రం రెవెన్యూ శివార్లో ఉన్న తమ ప్లాట్ల హద్దులను ధ్వంసం చేసి కబ్జా చేశారని, న్యాయం చేయాలని వేణుగోపాల్ నగర్ వెంచర్ యజమాన్యం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. విచారణ జరిపించాలని కలెక్టర్ నందిగామ ఎమ్మార్వోను ఆదేశించారని వెంచర్ ఓనర్స్ మీడియాకు తెలిపారు.

### యువతకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టాలి

**హైదరాబాద్, మార్చి 23,ప్రభాతవార్త:** యువతకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టాలని రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ సూచించారు. ఎంపీఎం గ్రూప్ సీ గ్రూప్ సీఎండీ గిరీష్ ముల్లపాని అధ్వర్యంలో స్థాపించిన సింపోజియం ఒక ప్రత్యే కమైన ఎలైట్ ఫోరం విజన్ వీడియో వెబ్సైట్‌ను నాలెడ్జ్‌సిటీలోని టీ హబ్‌లో ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లా డుతూ ప్రపంచంలో ప్రస్తుతం జరుగుతున్న యుద్ధాల ప్రభావం అందరిపై ఎంతో కొలత ప్రభావం చూపిస్తోందని, దానికి అధిగమిం చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని చర్యలు తీసుకుంటున్నాయన్నారు. శ్రీకాంత్ పాఠక మాట్లాడుతూ.. సింపోజియం ద్వారా జ్ఞానాన్ని నలుగురికి సంచేలా చేసేందుకు దీన్ని ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రానికి ఎన్ని పెట్టుబడులు వచ్చాయని కాదని, ఎన్ని గ్రౌండ్ అయ్యాయన్నదే ముఖ్యమన్నారు. ఏఐతో భయపడాల్సిన పనిలేదన్నారు.

## అవసర సమయంలో రక్తదానం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత

అత్తెల్లి జగన్నాథ్ రెడ్డి



రక్తదానం చేస్తున్న అత్తెల్లి జగన్నాథ్ రెడ్డి

**చేవెళ్ల, మార్చి 23, ప్రభాతవార్త :** అవసర సమయంలో రక్తదానం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని చేవెళ్ళ కు చెందిన సామాజిక సేవకుడు, స్థానిక యువకుడు అత్తెల్లి జగన్నాథ్ రెడ్డి తెలిపారు. సోమవారం ఖిచేవెళ్ల న్యూస్ గ్రూప్ఖి వాట్సాప్ వేదికగా పట్నం మహేందర్ రెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ రోగికి అత్యవసరంగా 0ప్లస్ రక్తం అవసరమని సమాచారం తెలుసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే జగన్నాథ్ రెడ్డి స్పందించి ఆసుపత్రికి చేరుకున్నారు. వైద్యుల పర్యవేక్షణలో రక్తదానం చేశారు. ఆయన సేవాస్ఫూర్తిని స్థానికులు అభినందించారు. ఇలాంటి సందర్భాల్లో యువత ముందుకు రావాలని పలువురు కోరారు. అవసర సమయంలో చేసిన ఈ సహాయం పలువురికి ప్రేరణగా నిలిచింది.

## నేడు డయల్ యువర్ డీఎం

**మేడ్చల్, మార్చి 23, ప్రభాతవార్త :** ఆర్టీసీ ప్రయాణీకుల సమస్యల సత్వర పరిష్కారానికి గాను నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మేడ్చల్ బస్ డిపో మేనేజర్ పరిమళ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు కల్పించేందుకు గాను, ఇతర అంశాలపై తగు సూచనల కొరకు గాను నేడు మధ్యాహ్నం 12 గంటల నుండి 1 గంటల వరకు మేడ్చల్ డిపోలో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. ఈ సమయంలో 9959226152 నంబర్ కు ఫోన్ చేసి సమస్యలు తెలుపడంతో పాటు తగు సూచనలు కూడ చేయాలని కోరారు.

## ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం




బస్‌టెర్మినల్ ఆవరణలో చలివేంద్రం ప్రారంభిస్తున్న చెంగిచర్ల డీఎం కల్పన, మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్

**ఘట్‌కేసర్, మార్చి 23, ప్రభాతవార్త:** వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం దోహదపడుతుందని ఘట్‌కేసర్ మాజీ సర్పంచ్- జనచైతన్య సేవాసమితి వ్యవస్థాపకులు అబ్బసాని యాదగిరియాదవ్ అన్నారు. ఘట్‌కేసర్ బస్‌టెర్మినల్ ఆవరణలో సోమవారం జనచైతన్య సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆర్టీసీ చెంగిచర్ల డిపో మేనేజర్ కల్పనతో కలిసి ఆయన ప్రారంభించారు. వేసవికాలం దృష్ట్యా జేసీఎస్ఎస్ ఆధ్వర్యంలో గత 13 సంవత్సరాలుగా బస్‌టెర్మినల్ వద్ద చలివేంద్రం నిర్వహిస్తున్నారు. ప్రయాణికులు, పాదచారులు, ఆటోడ్రైవర్లు, బస్ డ్రైవర్లు, కండక్టర్లకు త్రాగునీటిని అందించి దాహం తీర్చడానికి ఇక్కడ చలివేంద్రం అందుబాటులోకి తెచ్చినట్లు నిర్వహకులు తెలిపారు. ఈసందర్భంగా మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్‌ను శాలువా కప్పి సన్మానించారు. ఈకార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కుతాడి రవీందర్, మాజీ వార్డుసభ్యులు బర్ల దేవేందర్, జేసీఎస్ఎస్ ప్రధానకార్యదర్శి సార శ్రీనివాస్‌గౌడ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి శివరాత్రి సురేశ్, నాయకులు కంది ప్రేమ్‌కుమార్, దంతాల అనిల్‌కుమార్, నాగభూషణం, గోరకంటి రవీందర్, అహ్మద్ సంతోష్, ఇరిటం శ్రీనివాస్, కేఫా, అబ్బసాని ప్రవీణ్, సుబ్బారావు, కంది సాయిరాం, అక్బర్, తన్నీరు హరీష్, వెంకటేశ్, రామకృష్ణ, శివ తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

## ఘనంగా జడ్పీహెచ్ఎస్ పూర్వవిద్యార్థుల సమ్మేళనం

**ఘట్‌కేసర్, మార్చి 23, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. జడ్పీ స్కూల్ 1972-73 ఎస్ఎస్సీ బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థులు అందరూ 50 సంవత్సరాలకు ఒకచోట కలుసుకున్నారు. ఘట్‌కేసర్‌లో చదువుకొని ఉద్యోగ, వ్యాపారాల రీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారు 5 దశాబ్దాల తర్వాత కలుసుకొని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ తమ అనుభవాలను పంచుకున్నారు. తమ విద్యాబుద్ధులు నేర్పిన గురువులను స్మరించుకుంటూ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈసందర్భంగా పలు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించి పూర్వవిద్యార్థులను సన్మానాలు చేశారు. ఈసమ్మేళనం అందరికీ ఆనందంతో పాటు మరపురాని అనుభూతిని కలిగించింది. ఈకార్యక్రమంలో బత్తుల రామలింగంగౌడ్, మేకల దాసు, బి.మల్లారెడ్డి, ఎం.నరసింహ, మాణిక్యం, సుధాకర్, పి.యాదిరెడ్డి, సుదర్శన్, బాలకృష్ణ, కృష్ణారెడ్డిల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించగా 45 మంది పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ కేసు నిందితులను కస్టడీకి అనుమతించిన కోర్టు

**మొయినాబాద్, మార్చి 23, ప్రభాతవార్త :** మొయినాబాద్ లోని రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్ లో మార్చ్ 14 న ఈగల్ టీం దాడులు నిర్వహించిన సంగతి తెలిసిందే. డ్రగ్స్ కేసు విషయంలో పట్టుబడ్డ నిందితులను విచారణ నిమిత్తము పోలీసులు ఐదు రోజులు కష్టపడి ఇవ్వాలని శుక్రవారం సిట్ అధికారులు ఉప్పరపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు అయితే శని ఆదివారాలు సెలవు దినాలు కావడంతో పిటిషన్ విచారణ సోమారానికి వాయిదా పడింది శీతాధికారులు కస్టడీ కోరిన పిటిషన్ను విచారించిన ఉప్పర్ పల్లి కోర్టు న్యాయవాదులు సోమవారం తీర్పు వెలువరించింది నిందితులను మూడు రోజులపాటు పోలీస్ కస్టడికి అప్పగిస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది ఆ ముగ్గురిని విచారించడం ద్వారా డ్రగ్స్ నెట్వర్క్ మూలాలు సరఫరా దారుల వివరాలు రాబట్టాలని పోలీసులు చూస్తున్నారు చంచల్ గూడ జైల్లో ఉన్న నిందితులను విచారణ నిమిత్తం పోలీసుల ఆధీనంలోకి తీసుకొని రహస్య ప్రాంతాలకు తీసుకెళుతున్నారనే సమాచారం తెలుస్తుంది

## ప్రశ్నిస్తే..సంకెళ్ళా..

-బిజెపి నియోజకవర్గ కో ఆర్డినేటర్ వడ్ల నందు

**వికారాబాద్, ప్రభాతవార్త :** అధికార కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ఎండగడుతున్న బీజేపీ నాయకుల అక్రమ అరెస్టులను ఆపాలని, ప్రశ్నిస్తే సంకెళ్ళు వేస్తారా అంటూ బీజేపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వడ్ల నందు కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. సోమవారం వికారాబాద్ పోలీసులు బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టులు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బిజెపి నాయకులను అక్రమ అరెస్ట్ చెయ్యడం ప్రజా పాలన కాదని, రాక్షస పాలన అని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీల తో పాటు 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చినా..నేటికీ హామీలు అమలు చేయడం లేదని దుయ్యబట్టారు. ప్రజల పక్షాన నిలబడి అసెంబ్లీ ముట్టడికి సిద్ధమైన నాయకులను ముందస్తు అరెస్టులు చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడితే అరెస్టులతో భయపెట్టాలని చూడటం పిరికిపంద చర్య అని ఉద్ఘాటించారు. అరెస్టు చేసినంత మాత్రాన ప్రజల నుండి, వారి ఆగ్రహం నుండి తప్పించుకోలేరని,జైలు గోడలు ప్రజా ఉద్యమాలను ఆపలేవని అన్నారు. అణచివేత ధోరణి కాంగ్రెస్ పతనానికి నాంది పలుకు తుందని అన్నారు. అక్రమంగా అరెస్టు చేసిన రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచందర్ రావు, ఇతర కార్యకర్తలను ఎటువంటి షరతులు లేకుండా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో కొత్రేపల్లి కౌన్సిలర్ స్రవంతి శ్యాంరెడ్డి ,పెండ్లిమడుగు సర్పంచ్ సంతోష బుచ్చయ్య, మాజీ సర్పంచ్ బుచ్చి రెడ్డి, నాయకులు బస్వలింగం, మల్లారెడ్డి, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.



పోలీస్‌స్టేషన్ వద్ద మీడియా తో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

## ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో మెడికల్ క్యాంప్

**మెడికల్ క్యాంపు లను సద్వినియోగం చేసుకోవాలి చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్వో కే.లలితాదేవి**

**వికలాంగులకు సదరన్ క్యాంప్ మొయినాబాద్ లో ఏర్పాటు చేయాలి... కౌన్సిలర్ కరోల శ్రీధర్**



**మొయినాబాద్, మార్చి 23, ప్రభాతవార్త:** ప్రజా సమస్యలను త్వరితగతిన పూర్తి పరిష్కరించేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని అందులో భాగంగానే ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు సోమవారం మండల పరిధిలోని మొయినాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా డాక్టర్ అన్నపూర్ణ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని చేవెళ్ల శాసన సభ్యుడు కాలే యాదయ్య ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూప్రజల సమస్యలకు త్వరిత పరిష్కారం అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తూ అధికారులు మార్గనిర్దేశం చేశారు. ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరంలో వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, ప్రజల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. శిబిరానికి హాజరైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మొత్తం 368 మంది ఆరోగ్య పరీక్షలు చేయించుకోగా, అందులో మహిళలు 233 మంది, పురుషులు 135 మంది ఉన్నారు. మొయినాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఇటువంటి మెడికల్ క్యాంపులు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలను మండలంతో పాటు గ్రామ స్థాయిలో కూడా విస్తరించాలని ప్రజలు కోరారు. 14వ వార్డు మెంబర్ కర్రోల్ల శ్రీధర్ మాట్లాడుతూ వికలాంగులకు ఇచ్చే సదరన్ సర్టిఫికెట్ విషయంలోహైదరాబాద్లోని కొండాపూర్ కు లేదా తాండూర్ కో వెళ్లాల్సి వస్తుంది కాబట్టి చాలామంది వికలాంగులు అక్కడ వెళ్లలేక ఆ సర్టిఫికెట్ పొందలేక పింఛన్ రాలేక ఇబ్బంది పడుతున్నారని అన్నారు స్థానిక ఎమ్మెల్యే ఈ విషయాన్ని పరిశీలించి సదరన్ సర్టిఫికెట్ క్యాంపు లాంటిది మొయినాబాద్ లోనే ఏర్పాటు చేస్తే బాగుంటుందని అన్నారుకార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్వో కే. లలితాదేవి, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ పూనాం, డిప్యూటీ డాక్టర్ శ్రీనివాస్, చేవెళ్ల డివిజన్ డాక్టర్ అన్నపూర్ణ, ఎంఎల్‌హెచ్‌పీఎస్ డాక్టర్లు, సిహెచ్ఓలు, సూపర్వైజర్లు, మొయినాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ దూబ సోనియా, వైస్ చైర్మన్ గరుగు రాజు, మున్సిపల్ కౌన్సిలర్లు టిపిసిసి సభ్యులు షాబాద్ దర్శన్ ఆసుపత్రి సిబ్బంది ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాల అభివృద్ధి



పాడుబడ్డ ఇండ్లను నేలమట్టం చేస్తున్న దృశ్యం.



సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ శ్రీనివాస్

**మోమిన్‌పేట్, మార్చి 23, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాలలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని వెల్‌చాల్ గ్రామ సర్పంచ్ కే.శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం మోమిన్‌పేట్ మండలంలోని వెల్‌చాల్ గ్రామంలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ప్రధాన సమస్యలపై గత ప్రభుత్వాలు దృష్టి పెట్టలేదని, అలాంటిది నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో, తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ చొరవతో మారుమూల గ్రామాలలో ప్రధాన సమస్యలైనటువంటి త్రాగు నీరు, మురుగు కాలువలు, రహదారులు, అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామిలైనటువంటి ఆరు గ్యారెంటీలలో ప్రతి ఒక్కటి నెరవేర్చడం జరుగుతుందని సర్పంచ్ తెలిపారు. నేడు ప్రారంభించిన సీసీ రోడ్డు యంజీఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా పది లక్షల రూపాయల వ్యయంతో గ్రామం నుండి హిందూ స్మశానవాటిక వరకు వేస్తునట్లు తెలిపారు. అనంతరం గ్రామంలో పురాతనమైన, పాడుబడ్డ ఇండ్లను నేలమట్టం చేసి ఇతర ఇండ్లకు ఇబ్బంది కలగకుండా పూర్తిగా తొలగించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఉపసర్పంచ్ రమేష్, పీఏసీఎస్ సభ్యులు విజేందర్ రెడ్డి, వార్డు సభ్యులు రఘుపతి చారి, పోచయ్య, గ్రామ పౌర సరఫరాల డీలర్ అశోక్ కుమార్, స్థానిక నాయకులు రఘురాంరెడ్డి, కిరణ్ కుమార్, మల్‌రెడ్డి, ప్రసాద్ రెడ్డి, ప్రభుసాగర్, దామోదర్ సాగర్, నరహరి బిట్టు, రాములు, సాయి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఎఇ నిర్లక్ష్యంపై నిరసన



విద్యుత్ కార్యాలయం ఎదుట నిరపన వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు

**కొడంగల్,మార్చి 23,ప్రభాతవార్త :** కొడంగల్ పురపాలక పరిధిలోని శాంతినగర్ కాలనీలో 11కేవీ హైటెన్షన్ విద్యుత్ వైర్ల తొలగింపులో ఆ శాఖ ఏఈ నిర్లక్ష్యంపై కాలనీవాసులు విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు.వివిరాల్లోకి వెళితే..పట్టణంలోని శాంతినగర్‌కాలనీలో గత 40 సంవత్సరాలుగా గృహ నివాసాలపై నుండి వెళ్ళిన 11కేవీ హైటెన్షన్ వైర్లు తొలగించాలని పలుమార్లు ఉన్నతాధికారులు ,ప్రజాప్రతినిధులకు విన్నవించడం జరిగిందని కాలనీవాసులు తెలిపారు.ఈ క్రమంలో స్దానిక ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి ముఖ్య మంత్రి కావడంతో 11కేవీ హైటెన్షన్ వైర్ల తొలగింపునకు మోక్షం లభిండం జరిగిందన్నారు.ఈ క్రమంలో కాలనీలో ఒకరిద్దరు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారనే నెపంతో ఈ గత రెండు సంవత్సరాలుగా వైర్ల తొలగింపులో నిర్లక్ష్యం చేస్తున్నాడని వారు మండిపడ్డారు.విద్యుత్ వైర్ల తొలగింపుపై మున్సిపల్ కమీషనర్ చెప్పినప్పటికి ఏఈ ఉద్దేశపూర్వకంగా ఏకపక్షంగా వ్యవహరించడం సరికాన్నారు.సంభందిత విద్యుత్ ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.ఇదేవిషయమై సోమవారం విద్యుత్‌ఏఈ కార్యాలయం ఎదుట వారు నిరసన కార్యక్రమం చేపట్టారు.

## వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలకు ఏర్పాట్లు

**ఉత్సవ మూర్తుల విగ్రహాలను అందించిన తూంకుంట గ్రామ మాజీ సర్పంచు యాంసాని సురేశ్‌గుప్తా కుటుంబ సభ్యులు**



శ్రీరామనవమి వేడుకలకు ఉత్సవ మూర్తుల పంచలోహ విగ్రహాలను అందజేసిన తూంకుంట గ్రామ మాజీ సర్పంచు యాంసాని సురేశ్‌గుప్తా కుటుంబ సభ్యుల దృశ్యం



మాజీ సర్పంచు యాంసాని సురేశ్‌గుప్తా కుటుంబ సభ్యులు,పలువురు యువకుల దృశ్యం

**శామీర్‌పేట, మార్చి 23, ప్రభాతవార్త :** తూంకుంటలోని స్వయంభు శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలను (కళ్యాణంను) ఘనంగా నిర్వహించటానికి ఉత్సవ మూర్తులు (పంచలోహ) శ్రీ సీతా,రామ, లక్ష్మణ,హనుమాన్ విగ్రహాలను తూంకుంట గ్రామ మాజీ సర్పంచు యాంసాని సురేశ్‌గుప్త కుటుంబ సభ్యులు అందజేశారు. సోమవారం శామీర్‌పేట మండలంలోని తూంకుంటలోని స్వయంభు శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకల కళ్యాణం కోసం ఉత్సవ మూర్తులు పంచలోహ విగ్రహాలను (దాతలుగా) తూంకుంట గ్రామ మాజీ సర్పంచు యాంసాని సురేశ్‌గుప్తా-అనురాధ దంపతులు, వారి కుమారులు యాంసాని మధు సూదన్‌గుప్తా, యాంసాని విశ్వనాథ్‌గుప్తాలు పంచలోహ విగ్రహాలను ఆలయంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు ఆలయ పూజారి, పలువురు యువకులు, తదితరులు పాల్గొన్నారు.

## విప్లవ నిప్పుకణం భగత్ సింగ్..



భగత్ సింగ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

**చేవెళ్ల, మార్చి 23, ప్రభాతవార్త :** ఈరోజు చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్, 95వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్ మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం అతి చిన్న వయస్సులో ఉరికంబాన్ని ముద్దాడి దేశం కోసం ప్రాణత్యాగం చేసిన గొప్పవీరుడు భగత్సింగ్ అని అన్నారు. భగత్ సింగ్, సుఖ్‌దేవ్,రాజగురులను బ్రిటిష్ ప్రభుత్వం దారుణంగా ఉరితీసిందని వారు మరణించిన అనంతరం యువతరం పెద్ద ఎత్తున బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్నారు. ఈ దేశంలోని పేదల బడుగు బలహీనవర్గాల కోసం భగత్ సింగ్ సుగుదేవ్ రాజగురులు ప్రాణాలు అర్పించారని అన్నారు. తాను కలలు కన్నా స్వాతం త్రానికి విరుద్ధంగా ప్రస్తుత సమాజంలో పేదలు మరింత పేదరికంలోకి నెట్టివేయబడ్డారని ధనికులు వందల వేల కోట్లకు పడగలెత్తారని అన్నారు నాణ్యమైన విద్య వైద్యం దొరకక పేదలు అనేక ఇబ్బందులు పడుతున్నారని డబ్బులు ఉంటే తప్ప పేదలు చదువుకునే పరిస్థితి లేదని విద్య వైద్యం అంగడిలో సరుకుగా మారిందని అన్నారు భగత్ సింగ్ కలలుగన్న సంపూర్ణ స్వరాజ్యం ఇది కాదు అని అన్నారు. పేదవాడికి ఉచిత విద్య ,వైద్యం అందిం చాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు ఎర్రవల్లి శ్రీనివాస్ అధ్యక్ష కార్యదర్శులు, ఇర్ఫాన్ ,చందు, మొయినాబాద్ మండల అధ్యక్షుడు , రిశ్వంత్ , చరణ్ గౌడ్, డివిజన్ నాయకులు , విష్ణు కుమార్, నితీష్, నిఖిల్, అక్షయ్, నవీన్,లోకేష్,వివేకానంద, విద్యార్థులు, పాల్గొన్నారు.



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

## పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కరించాలి

-జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త :** పెండింగ్ లో ఉన్న ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుండి 135 పిర్యాదులు స్వీకరించారు.ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను పూర్తి స్థాయి లో పరిశీలించి పెండింగ్ ఉంచకుండా సత్వరమే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు పరిష్కరించడం అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజావాణిలో వచ్చే ప్రతి దరఖాస్తును అధికారులు జాగ్రత్తగా చదివి, అందులో పేర్కొన్న సమస్యలను పూర్తిగా అర్థం చేసుకుని, అవసరమైన విచారణ జరిపి సరైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచిం చారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను పెండింగ్ ఉంచకుండా నిర్ణీత కాలంలో పరిష్కరించి స్పష్టమైన నివేదిక సమర్పించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా వివిధ శాఖల వారిగా డి పి ఓ ,పంచాయతీ రాజ్, గృహ నిర్మాణ, డీఆర్‌డీఏ, ప్రణాళిక శాఖ, భూసేకరణ విభాగాలకు చెందిన అధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై వివరణ ఇవ్వాలని కోరారు. వారంలోపు అన్ని పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించి, గత వారం అందిన దరఖాస్తుల సంఖ్య, పరిష్కరించినవి, ఇంకా పెండింగ్‌లో ఉన్నవి వంటి వివరాలతో కూడిన సమగ్ర నివేదికను స్పష్టమైన నమూనాలో సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై అధికారులతో మాట్లాడుతూ గ్రామ పంచాయతీ, మండల, మున్సిపాలిటీ , జిల్లా స్థాయిలో రోజువారీ షెడ్యూల్ ప్రకారం ప్రజలు,.ప్రజా ప్రతినిధులునిర్వహించిన కార్యక్రమాలను తప్పని సరిగా ఫోటోలు పంపించాలని సూచించారు. ప్రతి రోజూ చేపట్టిన కార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలు, వివరాలను కార్యక్రమం అనంతరం జిల్లా అధికారుల వాట్సాప్ గ్రూపులో అప్లోడ్ చేయాలని, ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, అదనపు కలెక్టర్ రెవెన్యూ రాజేశ్వరి, జడ్.పి సీఈఓ సుధీర్, డిఆర్ఓ మంగీ లాల్,డిఆర్‌డి ఓ శ్రీనివాస్, ఆర్డీఓ వాసు చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసి పరిశీలిస్తున్న కలెక్టర్ దీపక్ తివారి

**వికారాబాద్, ప్రభాతవార్త :** పదవ తరగతి పరీక్షా కేంద్రాలను కలెక్టర్ దీపక్ తివారి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా కేంద్రంలోని పదవ తరగతి పరీక్షల సందర్భంగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ సంఘం లక్ష్మీ ్మబాయి గురుకుల పాఠశాలలోని పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా పర్యటించి పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం చీఫ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో విద్యార్థుల హాజరు, డ్యూటీ రిజిస్టర్, ప్రశ్నపత్రాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెడికల్ సిబ్బంది గురించి ఆరా తీశారు. పరీక్షల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. విద్యార్థుల హాజరు, సిబ్బంది హాజరు గురించి ఆరా తీశారు. నిబంధనలకు అనుగుణంగానే నిర్ణీత సమయంలో ప్రశ్న పత్రాలను తెరిచారా అని ఆరా తీశారు. తప్పనిసరిగా సి.సి కెమెరా రికార్డింగ్ నడుమ ప్రశ్న పత్రాల బండిల్ సీళ్లు తెరవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటి వసతి, ఆరోగ్య కార్యకర్త అందుబాటులో ఉన్నారా పరీక్ష హాల్లోకి సిబ్బంది ఎవరైనా సెల్ ఫోన్లతో వచ్చారా అని కలెక్టర్ పరిశీలన చేశారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సజావుగా పరీక్షలు జరిపించాలని సూచించారు. ఎక్కడ కూడా కాపీయింగ్ కు ఆస్కారం ఉండకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, కాపీయింగ్ కు ఆస్కారం కల్పిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు. పరీక్షలు ముగిసేంత వరకు అప్రమత్తతతో పకడ్బందీగా విధులు నిర్వహించాలని సూచించారు. ఎలాంటి తప్పిదాలకు అవకాశం ఇవ్వకుండా పూర్తి పారదర్శకంగా, పరీక్షలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.


BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATIOR MEDCHAL- MALKAJGIRI DIST AT: MEDCHAL.

ABR.CF NO : 172 OF 2025

Between :
M/s. KAPIL CHITS (HYD) PVT. LTD. KSET07J-31, SUCHITRA X ROAD-2 CAO Branch. ...DISPUTANT

AND

Mr. MADHU SIDDAGOUNI & OTHERS ...OPPONENTS

To,
1. Mr. Madhu Siddagouni, S/O. Bal Raj, Aged About : 43 Years, Occ: Community Coordinator, Emp Id: SERP/06140, Department Of Rural Development, Society For Elimination Of Rural Poverty, Government Of Telangana, Hyd, Telangana. R/O: H.No.1-45, Majeedpur Village, Abdullapurmet, Rangareddy, Telangana, India - 501512.
2. Mr. Chetti Raju, S/O. Chenna Kistaiah, Aged About :52 Years,Occ: Assistant Project Manager Emp Id Serp/01612, Department Of Rural Development Society For Elimination Of Rural Poverty, Govt Of Telangana, Hyd, Telangana.R/O:H.No.6-226, Sriram nagar Colony, Pasumamula, Abdullapur met, Rangareddy, Telangana, India - 501505.
3. Mr. Ankam Rajeshwar, S/O. Ramulu, Aged About :49 Years, Occ: Assistant Manager, Emp Id No. Serp/01575 Department Of Rural Development Government Of Telangana, Telangana. R/O: H.No.1-9-22, 1st Floor Viduth Nagar Colony, Dilsukhnagar, Ranga reddy, Telangana, India - 500060.
4. Mr. Gaddam Suresh, S/O. Narsimha, Aged About :40 Years,Occ: Administrative Assistant Emp Id Serp/ 90206 Department Of Rural Development Society For Elimination Of Rural Poverty, Hyd, Telangana. R/O: H.No.1-19/1, Opp Zphs School Batasingaram, Abdullapurmet, Ranga reddy, Telangana, India - 501512.

Whereas the above named Plaintiff has instituted a suit against you for recovery of money of **Rs. 1,79,757/-**. You are hereby summoned to appear in the above court in person or by an advocate duly instructed on the **07-04-2026** at **1:00 PM** failing which the matter will be decided exparte in accordance with law.

//BY ORDER OF THE APPELLATE AUTHORITY//

J. SRINIVAS REDDY,
ADVOCATE,
Hyderabad.



BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATIOR MEDCHAL- MALKAJGIRI DIST AT: MEDCHAL.

ABR.CF NO : 312 OF 2025

Between :
M/s. KAPIL CHITS (HYD) PVT. LTD. KKPM19H-10, KPHB CAO Branch. ...DISPUTANT

AND

Mr. Maheshwar Goud Yelavarthi & OTHERS ...OPPONENTS

To,
1. Mr. Maheshwar Goud Yelavarthi, S/O. Gopal Goud, Aged About : 35 Years, Occ: Police Constable(Civil) No 115, Emp Id 1839307, Dir Genl Insp. Genl Of Police Grp-Secunderabad, Kodapur, Medak, Telangana. R/O: Flat No-G6, Sai Priya Homes, Vandanapuri Colony, Beeramguda, Ameenpur, Rangareddy, Telangana, India, 502306.
2. Mr. K Balasubramanyam, S/O. Ramulu, Aged About :36 Years, Occ: Senior Software Engineer, Emp Id 2002108, Selenium Tower B, Plot Nos.31 & 32, Financial Kfin Technology Limited, Serlingampally, Hyd, Ts. R/O:PLOT No 824, V.V Nagar, Kukatpally, Medchal, Telangana, India, 500072.
3. Mr. Maddelapally Sai Charan Goud, S/O. Seenaiah, Aged About :31 Years, Occ: Senior Associate, Emp Id 20297820, Wipro Limited, Doddakannelli, Bangalore, Karnataka. R/O: 2nd Block, Q.No. 12, Police Quarters, Vikarabad, Rangareddy, Telangana, India, 501101.
4. Mr. Goundla Vittal, S/O. Shankaraiah, Aged About :50 Years, Occ: Driver-2, Emp Id. 219987, Huc Depot, Telangana State Road Transport Corporation, Telangana. R/O: H.No. 1-150/1, Kotlapoor, Rangareddy, Telangana, India, 501202.

Whereas the above named Plaintiff has instituted a suit against you for recovery of money of **Rs. 51,932/-**. You are hereby summoned to appear in the above court in person or by an advocate duly instructed on the **07-04-2026 at 1:00 PM** failing which the matter will be decided exparte in accordance with law.

//BY ORDER OF THE APPELLATE AUTHORITY//

J. SRINIVAS REDDY,
ADVOCATE,
Hyderabad.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**కీసర, మార్చి23, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సిఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం మల్యాల గ్రామానికి చెందిన రవీందర్ (54) తన ద్విచక్ర వాహనంపై ఈసిఐఎల్ నుండి తన సొంత గ్రామానికి వెలుతుండగా కీసర ఔటర్ రింగ్ రోడ్డు వద్ద చెత్త లారీ వెనుక టైర్ల కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలం నుండి ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ అక్కడి నుండి పరారయ్యాడు. ఈ కేసును కీసర పోలీసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అరెస్టులకు భయపడను

**బిజెపి రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కక్కునూరి వెంకటేష్ గుప్తా**

**షాద్ నగర్ టౌన్, మార్చి 23, ప్రభాతవార్త :** బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్ర రావు పిలుపు మేరకు చలో అసెంబ్లీ కార్యక్రమంకు పిలుపునిచ్చిన సందర్భంగా సోమవారం ఉదయం ఫరూక్ నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామంలో వెంకటేష్ గుప్తా సగృహంలో ముందస్తు అరెస్టు జరిగింది. ఈ సందర్భంగా కక్కునూరు వెంకటేష్ గుప్తా మీడియాతో ఫోన్లో మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడానికి ఇచ్చిన 6 హామీలు నెరవేర్చకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని కళ్యాణ లక్ష్మిలో తులం బంగారం ఇస్తానని మహిళలను మోసం చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని అరెస్టులు చేసినా హామీలు నెరవేర్చేవరకు పోరాటం చేస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.


పోలీసుల అదుపులో కక్కునూరు వెంకటేష్ గుప్తా

## అట్టడుగు వర్గాల అభ్యున్నతే లక్ష్యం

**రాష్ట్ర ఓబీసీ సెల్ చైర్మన్, షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**షాద్ నగర్, మార్చి 23, ప్రభాతవార్త :** అట్టడుగు వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ముందడుగు వేసి బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారాన్ని తెచ్చేందుకు కృషి చేస్తానని రాష్ట్ర ఓబిసి సెల్ చైర్మన్, షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఓబీసీ సెల్ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి బడుగు, బలహీన వర్గాలకు న్యాయం చేయాలనే లక్ష్యంతోనే ముందుకు సాగుతుందని, అందులో భాగంగానే ప్రత్యేక ఓబీసీ సెంటర్ ఏర్పాటుచేసి తనకు అవకాశం కల్పించిందని అన్నారు. పార్టీ తన మీద పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రామీణ స్థాయిలో బడుగు బలహీన వర్గాల నాయకత్వాన్ని పెంచి చట్ట సభల్లో వారికి ప్రాధాన్యత లభించేలా, రాజ్యాధికారం చేకూరేలా చర్యలు తీసుకుంటానని వెల్లడించారు. బలహీన వర్గాల్లో పుట్టినప్పటికీ తాను 25సంవత్సరాలుగా యాక్టివ్ పాలిటిక్స్ లో ఉన్నానని, ఈరోజు ఎమ్మెల్యేగా ఉన్నానంటే అది కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అవకాశమేనని గుర్తు చేశారు. గ్రామీణ ప్రాంతాలలో నాయకత్వ లక్షణాలను పెంచి సర్పంచులుగా, జడ్పిటిసిలుగా, ఎంపీటీసీలుగా అవకాశం కల్పించేందుకు ప్రయత్నిస్తామని అన్నారు. బలహీనవర్గాలకు అధికారాన్ని ఇప్పించడం ద్వారా ప్రజాస్వామ్యం అపహాస్యం కాకుండా కాపాడుతానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

## భగత్ సింగ్ స్పూర్తితో దేశం కోసం పాటుపడాలి

**ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఆమంచి నాగేశ్వర్**


**షాద్ నగర్, మార్చి 23, ప్రభాతవార్త :** యువత దేశం కోసం ప్రాణాలు అర్పించిన భగత్ సింగ్ జీవితాన్ని స్పూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆమంచి నాగేశ్వర్ అన్నారు. షాద్‌నగర్‌లో భగత్ సింగ్ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. భారత స్వాతంత్ర్య సమర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన మహావీరులు భగత్ సింగ్, రాజుగురు, సుఖదేవ్ అని, అలాంటి మహనీయుల త్యాగాలను అనుక్షణం గుర్తించుకొని దేశం కోసం పాటుపడాలన్నారు. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌లు కేవలం బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా పోరాడిన వీరులు మాత్రమే కాకుండా, సమాజంలో సమానత్వం, శోషణ రహిత వ్యవస్థ కోసం పోరాడిన గొప్ప విప్లవకారులని పేర్కొన్నారు. వారు భారత స్వాతంత్ర్య పోరాటానికి కొత్త దిశను చూపుతూ యువతలో ఆలోచనా స్వేచ్ఛ, ధైర్యం, త్యాగస్ఫూర్తిని నింపారని అన్నారు. భగత్ సింగ్ తన రచనలు, ప్రసంగాల ద్వారా సామాజిక అసమానతలు, కుల వివక్ష, ఆర్థిక దోపిడీపై తీవ్రంగా స్పందించారని, ఆయన కలలుగన్న సమాజం శోషణలేని సమాజమని వక్తలు వివరించారు. నేటి పరిస్థితుల్లో దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, విద్యా రంగంపై తగ్గుతున్న నిధులు, ప్రజా రంగ సంస్థల ప్రైవేటీకరణ, సామాజిక అసమానతలు, ఇవి భగత్ సింగ్ భావజాలానికి విరుద్ధమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి. నాగరాజు, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, జెవివి కురుమయ్య, ఫరూక్ నగర్ మండల విద్యాధికారి టీ మనోహర్, జె వి వి రాష్ట్ర కార్యదర్శి పి వెంకటరమణ గారు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్ రాజు టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్ నర్సింలు జేఏసీ నాయకులు జనార్ధన్, ఏఐ ఏడబ్ల్యూయు నాయకులు శ్రీను నాయక్, టీ జి ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ నాయక్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీకాంత్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్ చవన్, జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్, యువసత్తా లక్ష్మణ్ కుమార్, సీఐటీయూ నాయకులు చంద్రమోళి, ఐద్వా లక్ష్మి, వివిధ ప్రజా సంఘాలు డిగ్రీ కళాశాల విద్యార్థులు అధిక మొత్తంలో పాల్గొన్నారు.


భగత్ సింగ్ విగ్రహావిష్కరణలో హాజరైన విద్యార్థులు నాయకులు

## హామీలు అడిగితే అరెస్టులా?

**- బిజెపి నేతల ఆగ్రహ జ్వాలలు**

**కొత్తూరు, మార్చి 21, ప్రభాతవార్త;** రాష్ట్ర ప్రభుత్వం తన ఎన్నికల హామీల అమలులో విఫలమైందని, ఆ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రతిపక్ష నాయకులపై ముందస్తు అరెస్టులకు పాల్పడుతోందని బిజెపి జిల్లా కోశాధికారి అమూడాపురం నర్సింహా గౌడ్ తీవ్రంగా విమర్శించారు. బిజెపి రాష్ట్ర పార్టీ పిలుపునిచ్చిన అసెంబ్లీ ముట్టడిని అడ్డుకునేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలు పేరుతో ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, వాటి అమలును పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తే మా నాయకులను అరెస్ట్‌చేయడం హేయమైన చర్య. ఈ అరెస్టులకు మేము బెదరము. రెట్టింపు ఉత్సాహంతో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతాం అని నర్సింహాగౌడ్ స్పష్టం చేశారు. మోసం ఎక్కువ కాలం నిలవదని, ప్రజలు త్వరలోనే కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు. అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి ముందు పోలీసులు చేపట్టిన అరెస్టుల్లో కొత్తూరు మండల అధ్యక్షులు అత్తపురం మహేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బావండ్ల మాణిక్యం, మున్సిపాలిటీ జనరల్ సెక్రటరీ కోస్గి మల్లేష్, సీనియర్ నాయకులు చంద్రమోళి, కొత్తూరు రూరల్ ఉపాధ్యక్షులు విక్రమ్ రెడ్డి, కోశాధికారి రఘు గుప్తా, బూత్ అధ్యక్షులు సందీప్ సింగ్ తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.



కొత్తూరు బిజెపి నేతలను అరెస్టు చేసిన పోలీసులు

## శ్రీరామనవమి ఏర్పాట్లకు సహకరించండి

**డిప్యూటి కమీషనర్ వసంతకి వినతి**

**కీసర, మార్చి23, ప్రభాతవార్త:** కీసర సర్కిల్ పరిధిలోని సీతారామ చంద్రస్వామి ఆలయంలో ఈ నెల 27న జరుగనున్న శ్రీ రామనవమి ఏర్పాట్లకు సహకరించాలని ఆలయ చైర్మన్ రాయిల శ్రావణ్‌కుమార్‌గుప్తా సోమవారం కీసర సర్కిల్ డిప్యూటీ కమీషనర్ వసంతకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం శ్రీరామనవమిలో భాగంగా సీతా రామచంద్రస్వామి ఆలయంలో జరుపుకుంటామని ఆయన తెలిపారు. శానిటేషన్‌తో పాటు కళ్యాణంకు కావాల్సిన ఏర్పాట్లను చూడాలని, కళ్యాణంకు అధికారికంగా తలంబ్రాలు సమర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు గుర్రం మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆనబోయిన జంగయ్య, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, శంకర్‌గౌడ్, బాలరాజు, రమేష్, కోశాధికారి రవీందర్, సంయుక్త కార్యదర్శులు ప్రవీణ్, క్రిష్ణారెడ్డి, చంద్రయ్య, సలహాదారులు బుచ్చిరెడ్డి, వెంకటేష్, బెలిదె రమేష్‌గుప్తా, రమేష్ గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, గణేష్, మల్లేష్, భూపాల్, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటి కమీషనర్ వసంతకి వినతిపత్రం అందజేస్తున్న ఆలయ చైర్మన్ శ్రావణ్ కుమార్ గుప్తా

## నేవీ రాడార్‌స్టేషన్ పనుల పరిశీలన

**పూడూరు, మార్చి 23, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా పూడూరు మండల కేంద్రం దామగుండం అటవీ ప్రాంతంలో నూతనంగా నిర్మిస్తున్న నేవీ రాడార్ స్టేషన్‌ను సోమవారం భాతరనౌకాదళ ఉపాధ్యక్షుడు, వైస్‌అడ్మిరల్ సంజయ్ వత్సాయన్( పివిఎస్ఎం, ఎవిఎస్ఎం, ఎన్ఎం )స్థానిక ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డితో కలిసి సందర్శించి పనులను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు దేశభద్రతతోపాటు ఈ ప్రాంతాభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. నేవీ రాడార్ స్టేషన్ దామగుండంలో ఏర్పాటును అదృష్టంగా భావించా లన్నారు. ఈ ప్రాజెక్ట్‌పనులు చురుకుగా సాగేందుకు కృషిచేసిన ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిని సన్మానించి మెమెంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నేవీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


దామగుండంలో నేవీ రాడార్ స్టేషన్ పనులను పరిశీలిస్తున్న భాతరనౌకాదళ ఉపాధ్యక్షుడు, వైస్‌అడ్మిరల్ సంజయ్ వత్సాయన్, ఎమ్మెల్యే టిఆర్ఆర్ తదితరులు

## ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి పూర్తి చేయూత నిస్తా

**..తూంకుంట మాజీ సర్పంచు ఎద్దు నాగేశ్‌యాదవ్**

**శామీర్‌పేట, మార్చి 23, ప్రభాతవార్త:** మల్కాజ్‌గిరి నగర మున్సిపల్ కార్పోరేషన్ పరధిలోని పోతాయిపల్లిలో గౌడ సంఘం వారి ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి పూర్తి సహకారం ఉంటుందని, అన్ని విధాలుగ చేయూత నిస్తానని తూంకుంట గ్రామ మాజీ సర్పంచు ఎద్దు నాగేశ్‌యాదవ్ తెలిపారు. సోమవారం శామీర్‌పేట మండలంలోని పోతాయిపల్లి (మల్కాజ్‌గిరి నగర మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో ఉన్న)లో నిర్మిస్తున్న ఎల్లమ్మ ఆలయ నిర్మాణ పనులను సందర్శించి పరిశీలించారు. ఆలయ గౌడ సంఘం వారి ఆహ్వానం మేరకు ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచు ఎద్దు నాగేశ్‌యాదవ్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన శక్తి మేరకు అన్ని విధాలుగా పూర్తి సహకారం అందిస్తానన్నారు. అవసరమైన సహాయ సహకారాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో పోతాయిపల్లి గౌడ సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు టి. దర్శన్‌గౌడ్, టి. మురళీగౌడ్, టి. ప్రవీణ్‌కుమార్‌గౌడ్, టి. ముత్యాలుగౌడ్, టి. రాజుగౌడ్, పంజాల రాజుగౌడ్, టి. నాగేశ్‌గౌడ్, పి. రాజుగౌడ్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.


పోతాయిపల్లిలో శ్రీ ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న తూంకుంట మాజీ సర్పంచు ఎద్దు నాగేశ్‌యాదవ్‌ను సన్మానించిన ఆ ఆలయ గౌడ సంఘం సభ్యుల దృశ్యం


పోలీస్ స్టేషన్‌లో బిజెపి నాయకులు

### హామీలు అమలు చేయకపోతే

## పోరాటం ఉధృతం

**మాడ్గుల , మార్చి 23, ప్రభాతవార్త :** రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయలేదని నిరసిస్తూ అసెంబ్లీ ముట్టడికి బిజెపి పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో మాడ్గుల మండలంలో పోలీసులు ముందస్తు చర్యలకు దిగారు. బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు దండు శ్రీనివాస్ గౌడ్, మండల ఉపాధ్యక్షుడు మాదాసు వెంకటయ్య గౌడ్, మండల సీనియర్ నాయకుడు ఈరమల్ల శ్రీనివాస్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శులు మెట్టు శ్రీనివాస్ గౌడ్, పేర్ల హరీష్ రెడ్డి, వార్డు సభ్యుడు ఎమ్మె శేఖర్‌లను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా దండు శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు ప్రజల హక్కుల కోసం ఈ పోరాటం చేపట్టాం. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు మరింత ఉధృతం చేస్తాం. ప్రజల కోసం పోరాడుతున్న మమ్మల్ని అరెస్టులు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం అని అన్నారు. శాంతిభద్రతల దృష్ట్యా ముందస్తు అరెస్టులు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.


జంగారెడ్డి పల్లెలో నిరసన చేపడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

## అక్రమంగా ఎస్సీ కుల సర్టిఫికెట్ ... ఎన్నికల్లో పోటీ చేయడం భావ్యమా

**తలకొండపల్లి, మార్చి 23 ,ప్రభాతవార్త;** సర్టిఫికెట్లు పొంది దళిత వర్గాలను మోసం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి రంగారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణ మాదిగ. దేశంలో అంటరానితనం అవమానాలకు గురైన వారికి భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చొరవతో రాజ్యాంగం కల్పించబడ్డ రిజర్వేషన్లను సైతం కొంతమంది అక్రమంగా కుల ధ్రువీకరణ పత్రాలు పొంది దళిత కిందివర్గాలను మోసానికి గురి చేస్తు రిజర్వేషన్లతో లబ్ధి పొందుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణ మాదిగ అన్నారు. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిధిలోని జంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన దాసరి మల్లేష్ ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో ఎస్సీ కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ పొంది దళిత వర్గాలకు లభించే రిజర్వేషన్ ద్వారా కొంతమంది అధికారుల ప్రోద్భలంతో లబ్ధి పొందుతున్నాడని అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకొని అతని కుల దృవీకరణ పత్రాన్ని రద్దు చేయాలని కోరుతూ రద్దు చేయాలని సోమవారం నాడు జంగారెడ్డి పల్లి గ్రామంలో అన్ని కులాల నాయకులతో కలిసి స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పోతుగంటి కృష్ణ మాదిగ మాట్లాడుతూ కొంతమంది ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ పేరుతో మతతత్వం పేరుతో సంఘంగా ఏర్పడి దాసరి కులస్తులకు మద్దతుగా తెలుపుతూ ఉన్నారని, నిజమైన ఎస్సీలకు వీరి ద్వారా అన్యాయం గురయ్యే ప్రమాదం ఉందని, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి దాసరి కులాన్ని బిసి ఏ జాబితాలో చేర్చినప్పటికీ ఎస్సీ షెడ్యూల్ క్యాస్ట్ సర్టిఫికెట్ పొందడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఎన్నో సంవత్సరాలుగా గ్రామంలోని దాసరి కులస్తులు బిసి సర్టిఫికెట్తో లబ్ధి పొందుతున్నారని, ఇటీవల ఎస్సీ లోకి మారడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. గ్రామంలోని అన్ని కులాల నాయకులతో విచారణ చేపట్టి సర్పంచిగా గెల్పొందిన మల్లేష్ కుల ధృవీకరణ పత్రాన్ని రద్దు చేసి ఎస్సీలకు నిజమైన ఎస్సీలకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు రామచంద్రయ్య, కిరణ్ మాదిగ, కొప్పు యాదయ్య సంజీవ మీసాల బాలస్వామి గ్రామ కమిటీ అధ్యక్షుడు గోపాల్ మీసాల మహేష్ శివ ప్రదీప్ పరమేష్ బక్కయ్య కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## అభాగ్యుల పాలిట.. ఆత్మబంధువు

**అన్ని తానై అనాధ మహిళా శవానికి అంత్యక్రియలు జరిపిన మానవతామూర్తి**

**(నందిగామ మార్చి 23 (ప్రభాత వార్త) :** ఉపాధి కోసం ఆంధ్ర ప్రాంతం నుండి వచ్చిన ఓ అనాధ మహిళ శవానికి దహన సంస్కారాలు చేసిన ఘటన సోమవారం నందిగామ మండలం అయ్యప్ప స్వామి దేవాలయ పరిసర ప్రాంతాల్లో చోటుచేసుకుంది. 15 సంవత్సరాల క్రితం ఆంధ్ర నుండి వలస వచ్చిన లక్ష్మమ్మ (70) అనే మహిళ నందిగామ పరిసర ప్రాంతాల్లో కూలినాలీ చేసుకొని జీవనం గడిపేది. చుట్టుపక్కల కాలనీ ప్రజలకు తలలో నాలుకల మెలిగిన లక్ష్మమ్మ అనారోగ్యం బారినపడి ఆదివారం సాయంత్రం చనిపోయింది. ఈ విషయం తెలిసిన నందిగామ 11వ వార్డు సభ్యుడు కే కిట్టు అనాధ శవానికి అన్ని తానై సొంత ఖర్చులు వెచ్చించి అంత్రక్రియలు నిర్వహించారు. అనాధ వృద్ధ మహిళకు సర్పంచ్ కొమ్ము కృష్ణ సైతం సహాయం చేసినట్లు వార్డు సభ్యుడు కిట్టు తెలిపారు. దిక్క మొక్కు లేని అనాధ శవానికి అన్ని తానై అంత్యక్రియలను నిర్వహించిన వార్డు సభ్యుడు కిట్టును దుపక్కల గ్రామాల ప్రజలు అభినందించారు.


అంతక్రియల కోసం శవాన్ని తెస్తున్న కిట్టు మిత్రులు

## సమాజంలో సమాత్వమే నిజమైన ప్రజాస్వామ్యం

**ఘట్‌కేసర్, మార్చి 23, ప్రభాతవార్త:** అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం ద్వారానే సమాజంలో సమానత్వం వచ్చిందని సబండ వర్గాలకు రాజ్యాధికారం వస్తుందని కేబీ యూత్ అధ్యక్షులు సార అభినందన్‌గౌడ్ అన్నారు. ఘట్‌కేసర్‌లో ప్రబుద్ధభారత్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో అంబేద్కర్ ఆలోచనావిధానాన్ని ప్రజలలోకి తీసుకువెళ్లడానికి 258వ వారం నిత్యపూలమాల కార్యక్రమం నిర్వహించారు. ఘట్‌కేసర్ డివిజన్ కుమ్మరిబస్తీ కేబీ యూత్ అధ్యక్షులు సార అభినందన్‌గౌడ్‌తో పాటు ఉపాధ్యక్షులు మడిపడిగె సాయి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి మడిపడిగె ఉపేందర్, కార్యదర్శి సార సాయికిరణ్‌గౌడ్, బాలనగరం గణేశ్‌గౌడ్‌లు విచ్చేసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పిబిఐ మేడ్చల్ జిల్లా సమన్వయకర్త మీసాల అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అబినందన్‌గౌడ్ అంబేద్కర్ అందించిన సేవలను, పోరాటాలను తెలియజేస్తూ ఆయన ఆశయాల సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. అంబేద్కర్ మహద్ సత్యాగ్రహం చేసి 99 సంవత్సరాలు గడుస్తున్న సందర్భంగా మహాది సత్యాగ్రహంపై అరుణ్ కుమార్ తెలియజేశారు. ఈకార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం ప్రధాన కార్యదర్శి ఇరిటం శ్రీనివాస్, నాయకులు రాజేశ్‌కుమార్, షేక్‌వాజీద్, జి. అంజయ్య, బాలనగరం సురేశ్‌గౌడ్, జి. మహేశ్, రేవంత్‌గౌడ్, ఎం. ఉదయన్, ఎం. మురళీ, ఇ. విష్ణు తదితరులు పాల్గొన్నారు.


రాంపల్లిలో సమస్యలను పరిష్కరించాలని ఐఏఎస్ రాధికగుప్తాకి వినతి పత్రం అందజేస్తున్న రామారం వినోద్‌కుమార్

## 10రోజులలో పనులు ప్రారంభిస్తాం

**రాంపల్లిలో సమస్యలపై హామీ ఇచ్చిన ఐఏఎస్ రాధికగుప్తా**

**కీసర, మార్చి23, ప్రభాతవార్త:** నాగారం డివిజన్ పరిధిలోని రాంపల్లి గ్రామంలో సమస్యలను పరిష్కరించాలని ఉప్పల్ జోనల్ కార్యాలయంలో ఐఏఎస్ అధికారా రాధిక గుప్తాకి సోమవారం నాయకులు రామారం వినోద్‌కుమార్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిహెచ్ఎంసి 5వ డివిజన్‌లోని ఎలిఫెంట్ కాలనీలో ఉన్న సమస్యలను వివరించడం జరిగిందన్నారు. వెంటనే స్పందించిన రాధికగుప్తా 10 రోజులలో పనులను ప్రారంభిస్తామని హామీ ఇచ్చారన్నారు. అలాగే చెరువులో గుర్రపు డెక్క, దోమల నివారణ చర్యలను చేపడతామని తెలిపారన్నారు.

## డిపోలలో పేరుకుపోయిన వాహనాలకు వేలం

**- డిప్యూటీ కమిషనర్ సదానందం**

**రంగారెడ్డిజిల్లా ప్రతినిధి, మార్చి 23, ప్రభాత వార్త : ఆర్టీఏ** రంగారెడ్డి పరిధిలో సుదీర్ఘకాలంగా ఆర్టీసీ డిపోలలో నిల్వ ఉన్న వాహనాలపై రవాణా శాఖ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సదానందం తెలిపారు. డిపోలలో వాహనాలు అధికంగా పేరుకుపోవడంతో పార్కింగ్ సమస్యలు తీవ్రమవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. జాబితాలో ఉన్న వాహనాల నమోదిత యజమానులు, స్వాధీనదారులు లేదా ఫైనాన్సియర్లు తప్పనిసరిగా మార్చి27 లోపు సంబంధిత అధికారిని సంప్రదించి వాహన విడుదల ఉత్తర్వులు పొందాలని సదానందం స్పష్టం చేశారు. గడువులోగా స్పందించని పక్షంలో, ఎటువంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండా వాహనాలను నేరుగా బహిరంగ వేలంలో విక్రయిస్తామని హెచ్చరించారు. డిపోలలో భారీ సంఖ్యలో వాహనాలు నిల్వ ఉండటంతో నిర్వహణలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ఈ నేపథ్యంలో వేలం ప్రక్రియకు విస్తృత ప్రచారం కల్పించేందుకు అన్ని ప్రధాన దినపత్రికలలో ప్రకటనలు విడుదల చేయనున్నట్లు తెలిపారు. సంబంధిత వాహన యజమానులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

## ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశాలు


మేడ్చల్‌లో ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

**మేడ్చల్, మార్చి 23, ప్రభాతవార్త :** మేడ్చల్ సర్కిల్ పరిధిలోని మేడ్చల్ పట్టణానికి చెందిన గుండ రాములమ్మ, పూడూర్ గ్రామానికి చెందిన బాబురావుల ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశ ప్రారంభోత్సవాన్ని కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. పేదల కళ్ళలో ఆనందం నింపడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా పలువురు నాయకులు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని, ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదిగాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయి మార్కెట్ కమిటీ డైరెక్టర్ రేగు రాజు, మేడ్చల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చీర్ల రమేష్, నాయకులు కొడే మహేష్, ఉదండపురం సత్యనారాయణ, లవంగు రాకేష్, గుండ శ్రీధర్, దండు శ్రీకాంత్, కనకాల నాగభూషణం, పోచయ్య, సత్తి రెడ్డి, వెంకటేష్, శేఖర్ రెడ్డి, రామన్నగారి రాఘవేందర్ గౌడ్, నడికొప్పు రంజిత్, రామన్నగారి సంతోష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ సర్పంచుల నిధులు కాంగ్రెస్ సర్పంచులకు మళ్లింపు

**- పరిగి మండల సర్పంచుల ప్రెస్ మీట్**

**పరిగి, మార్చి 23, ప్రభాతవార్త :** పంచాయితీ ఎన్నికలలో గ్రామ ప్రజల తీర్పుతోనే బిఆర్ఎస్ పార్టీ నుండి మేము సర్పంచులుగా గెలిచామని , బిఆర్ఎస్ పార్టీ సర్పంచులకు నిధులు రాకుండా కాంగ్రెస్ సర్పంచులకు నిధులు మళ్లిస్తున్నారని పరిగి మండల బిఆర్ఎస్ సర్పంచులు ఆరోపించారు.. సోమవారం పరిగి పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే నివాసంలో సర్పంచులు పత్రికా సమావేశాన్ని నిర్వహించారు.. బిఆర్ఎస్ పార్టీకి చెందిన సర్పంచులపై స్థానిక ఎమ్మెల్యే వివక్షత చూపిస్తున్నారని ఆరోపించారు. కేంద్రం నుంచి వచ్చే ఉపాధి హామీ నిధులను కూడా వారికి రాకుండా, గ్రామాల అభివృద్ధికి సహకరించడంలేదని సర్పంచులు తెలిపారు. ప్రజల తీర్పుతో గెలిచిన మాకు, మా గ్రామ అభివృద్ధికి సహకరించకుంటే ఎమ్మెల్యేను అడ్డుకుంటామని ,ప్రజలతో కలిసి ధర్నా చేపడతామని బిఆర్ఎస్ సర్పంచులు పేర్కొన్నారు. రంగాపూర్, తొండపల్లి, మిట్ట కోడూర్, మాదారం, కుదావన్ పూర్, రాపోల్, చిట్యాల, బసిరెడ్డిపల్లి, రూప్ ఖాన్ పేట్, బర్కత్ పల్లి , రాఘవాపూర్ సర్పంచులు మందాకిని, కృష్ణయ్య, మాణిక్యం, రాములు, యాదయ్య, క్రిష్ణ, రాజు, శ్రీశైలం, అంజమ్మ, భ్రమరాంబ, స్రవంతి లు సమావేశంలో పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ నేతలు

## నూతన పంచాయతి కార్యదర్శికి ఘన సన్మానం

**శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆలంపల్లి ఆనందం**

**మోమిన్‌పేట్, మార్చి 23, ప్రభాతవార్త:** మోమిన్‌పేట్ మండల పరిధిలో గల కేసారం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పదవి బాధ్యతలు చేపట్టిన మహమ్మద్ మసీ యొద్దీన్‌ను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆలం పల్లి ఆనందం ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శిని పూల బొకే ఇచ్చి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చంద్రకళ నర్సింహులు, వార్డు సభ్యులు అంజయ్య, బొజ్జ సుభాష్, పీర్ ఇఫాయత్ అలీ, మాజీ వార్డు సభ్యులు బొజ్జ అనిల్, పి. శ్రీకాంత్, నాయకులు మల్లేశం, బషీర్, గడ్డమీది రాజు, డప్పు ఏసయ్య, పంచలింగాల పరమేష్, డప్పు భూమయ్య, గడ్డం అమీర్, రఫీ, సమీర్, రిజ్వాన్, రెహాన్, రియాజన తదితరులు పాల్గొన్నారు.


గ్రామ పంచాయతీ కార్యదర్శికి సన్మానించిన కేసారం గ్రామస్తులు